- మెప్మాలో గోల్‌మాల్ వాస్తవమేనన్న మేయర్ సుజాత
- వైసీపీ వాళ్లను కాపాడి, అధికారులను బాధ్యులను చేసే ప్రయత్నం
- ఆర్పీలు, సీవోలతో అధికారుల సమావేశం
- బోగస్ గ్రూపులు, బ్యాంకులకు బురిడీపై బాలినేని సీరియస్
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో అక్రమార్కుల్లో ఉలికిపాటు

బోగస్ గ్రూపులను సృష్టించి బ్యాంకులను బురిడీ కొట్టించి రూ. కోట్లు దండుకున్న ఆర్పీలు, వైసీపీ మహిళా నేతల అవినీతి డొంక కదులుతోంది. వాస్తవాలను తేల్చేందుకు మెప్మా అధికారులు బుధవారం ఆర్పీలు, సీవోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. బోగస్ గ్రూపులపై విచారించడంతోపాటు రుణాలు ఎవరు తీసుకున్నారు? ఎప్పుడు తీసుకున్నారు? ఎంత తీసుకున్నారు? అన్న వివరాలను సేకరించారు. ఇదేసమయంలో మేయర్ గంగాడ సుజాత తన చాంబర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొందరు నకిలీ పొదుపు గ్రూపులతో రుణాలు తీసుకున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కాకుంటే ఆమె తెలివిగా అధికారులు, బ్యాంకర్లను బాధ్యులను చేస్తూ వైసీపీ నేతలను కాపాడేందుకు ప్రయత్నించడం గమనార్హం.





రుణ దోపిడీ

డొంక కదులుతోంది!

వారికి అండదండలు.. వీరిపై నిందలు

మెప్మాలో రుణాల పేరుతో జరిగిన గోల్‌మాల్ బాగోతంలో భాగస్వాములైన వారిలో అధికశాతం మంది వైసీపీకి చెందిన వారే ఉన్నట్లు ఆధారాలు వెలుగుచూస్తున్నాయి. అయితే నష్టనివారణ చర్యల్లో భాగంగా మేయర్ తమ పార్టీ వారిని సమర్థించుకుంటూ, టీడీపీకి చెందిన ఆర్పీలు ఉన్నట్లు వెల్లడించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇందులో కీలకంగా వ్యవహరించిన కొందరు ఆర్పీల పేర్లు మాత్రమే బహిర్గతం చేసిన మేయర్.. మెప్మాకి సంబంధం లేకుండా బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొందిన అధికార పార్టీ మహిళా నాయకులు, ఇతర నాయకుల పేర్లు కప్పిపుచ్చడం వెనుక అవినీతిలో సూత్రధారులకు వైసీపీ అండదండలు బాగానే ఉన్నాయని స్పష్టమవుతోంది. మేయర్ మీడియా సమావేశంలో వారి పేర్లు మాత్రం వెల్లడించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసి, ప్రకంపనలు సృష్టించిన మెప్మా స్కాంలో వైసీపీ వారి హస్తం వెలుగుచూడటంతో అబ్బే మాకేం తెలియదు.. అంతా వారే చేశారంటూ అధికారులను బలి చేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. తమ పార్టీ వారిని కాపాడుకుని, మెప్మా అధికారులను బాధ్యులను చేసి, తాము చేసిన అవినీతి మరకలను తొలగించుకోవడం కోసం ఇక్కడి నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లుగా స్పష్టమవుతోంది. ఈ వ్యవహారంలో పీడీతోపాటు సీఎంఎం, సీవోలు, ఇతర ఉద్యోగులను బాధ్యులను చేయడానికి వైసీపీ నేతలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో చోటుచేసుకున్న రుణాల గోల్‌మాల్ వ్యవహారంపై ఎట్టకేలకు అధికారులు కదిలారు. కోట్లు దండుకున్న ఆర్పీలు, అధికారపార్టీ నేతల దోపిడీ గుట్టును రట్టు చేసేందుకు విచారణ చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వరుస కథనాలతో అవినీతి డొంక కదులుతోంది. ఇదిలాఉండగా మేయర్ గంగాడ సుజాత అక్రమాలు నిజమేనని ఒప్పుకుంటూనే వైసీపీ నేతలను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. బ్యాంకులను బురిడీ కొట్టించి తీసుకున్నది రూ.50 కోట్లు కాదని, రూ.12కోట్లు మాత్రమేనని ప్రాథమికంగా గుర్తించామని వెల్లడించారు. అదేసమయంలో రుణ దోపిడీ వ్యవహారంలో వైసీపీ నాయకుల భాగస్వామ్యం, అధికారుల నిర్లక్ష్యం, రుణాల మంజూరులో అక్రమాలపై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సీరియస్ అయ్యారు. అందిన సమాచారం మేరకు బాలినేని.. కలెక్టర్, మెప్మా పీడీ, సీఎంఎం కొండయ్యలతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. దీనిపై విచారణ వేగవంతం చేయాలని సూచించడంతో ఆర్పీలు, సీవోలతో పీడీ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. అయితే మేయర్ సుజాత అసలు వాస్తవాలను దాచిపెట్టి అధికారులు, బ్యాంకర్లపై నిందలు వేసి అధికారపార్టీలోని అక్రమార్కులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

ఎమ్మెల్యే బాలినేని సీరియస్

మెప్మాలో గోల్‌మాల్ వ్యవహారం బయటపడటంతో మేయర్ సుజాత మంగళవారం హుటాహుటిన విజయవాడ బయల్దేరి వెళ్లారు. అక్కడ బాలినేనిని కలిసి ఇక్కడ చోటుచేసుకున్న అక్రమాలు, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూపించి ఏం చేయాలన్న దానిపై చర్చించినట్లు సమాచారం. వెంటనే స్పందించిన బాలినేని.. కలెక్టర్ దినేష్‌కుమార్, పీడీ రవికుమార్‌తోపాటు, సీఎంఎం కొండయ్యతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై విచారణ చేయాలని కలెక్టర్‌ను కోరడంతోపాటు మెప్మా అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. అసలు మెప్మాలో ఏం జరుగుతుంది? ఇంత పెద్దమొత్తంలో అవినీతి జరుగుతుంటే ఏం చేస్తున్నారు? అని అధికారులపై మండిపడినట్లు సమాచారం.



నకిలీ గ్రూపుల పేరుతో రుణాలు నిజమే : మేయర్

ఒంగోలు నగరపాలక సంస్థలో భాగస్వామ్యమైన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో నకిలీ గ్రూపుల పేరుతో రుణాల కుంభకోణం వాస్తవమేనని ప్రాథమికంగా గుర్తించినట్లు మేయర్ గంగాడ సుజాత తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పత్రికలో రాసిన విధంగా రూ.50కోట్ల మేర గోల్‌మాల్ జరగలేదని, ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు అది రూ.12కోట్ల వరకూ ఉండొచ్చని చెప్పారు. అది కూడా పొదుపు రుణాలు కాకుండా మరో పేరుతో గ్రూపుల ద్వారా తీసుకునే అవకాశం ఉందన్నారు. 2022లో రుణాలు తీసుకున్న కొందరు ఆర్పీలు తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకర్లు దీనిపై మెప్మా అధికారులకు సమాచారం కూడా ఇచ్చారన్నారు. అయితే ఈ కుంభకోణంలో కేవలం వైసీపీకి చెందిన ఆర్పీలు, నాయకులే కాకుండా టీడీపీకి చెందిన ఆర్పీలు కూడా భాగస్వాములై ఉన్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై అధికారులు విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. అయితే టీడీపీ నాయకులు అయిన దానికి, కాని దానికి, సంబంధం లేని వాటికి కూడా బాలినేని పాత్ర ఉందని మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో భూకుంభకోణంపై సిట్ వేయించింది బాలినేని అని, అలాగే ఇప్పుడు మెప్మాలో అవినీతిపై అవసరమైతే సిట్‌తో విచారణ చేయించాలని కలెక్టర్‌ను ఆమె కోరారు.

విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

మెప్మాలో రుణ కుంభకోణం ఆరోపణలపై విచారణ జరుపుతున్నాం. వాస్తవమని తేలితే ఎంతటివారికైన అయినా తగిన చర్యలు తీసుకుంటాం. పట్టణ పొదుపు మహిళల ఆర్థిక పురోభివృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ప్రోత్సహిస్తోంది. దీనిని ఆసరా చేసుకుని కొందరు అవినీతికి పాల్పడినట్లు పత్రికలలో రావడం బాధాకరం. సీఎంఎం, సీవోలు, సీఎల్‌ఆర్పీలు, ఆర్పీలు ఇలా ఏస్థాయిలో అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదు. అక్రమాలు రుజువైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్నీ బ్యాంకులకు లేఖలు రాశాం. వివరాలు సేకరిస్తున్నాం. విచారణను వేగవంతం చేసి తగు చర్యలు తీసుకుంటాం. సిబ్బంది, ఆర్పీలు, బ్యాంకర్లతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేయడంతోపాటు, పూర్తిస్థాయిలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

- టి. రవికుమార్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

ఎట్టకేలకు డీఎస్సీ నోటిఫికేషన్

- ఖాళీ పోస్టుల్లో కోత
- 730కి కేవలం 503 ప్రకటన



ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 7 : నిరుద్యోగ ఉపాధ్యాయుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. అయితే పోస్టుల ప్రకటన విషయంలో మాత్రం నిరాశే ఎదురైంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక గత నాలుగున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులను ఉసూరుమనిపించేలా డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించింది. మెగా డీఎస్సీ పేరుతో కనీసం 15 వేల పోస్టులకు తక్కువ కాకుండా ప్రకటిస్తారనుకుంటే కేవలం 6,100 పోస్టులకు మాత్రమే ఇచ్చారు. జిల్లాలో 730 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఇక్కడి డీఈవో కార్యాలయం నుంచి పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి నివేదించారు. అయితే డీఎస్సీలో కేవలం 503 పోస్టులు మాత్రమే ప్రకటించారు. ఎస్‌జీటీ ఖాళీలు 240 ఉండగా కేవలం 111 మాత్రమే ప్రకటించారు. 129 పోస్టులు మిగిలిపోయాయి. అదేవిధంగా వివిధ సబ్జెక్టుల్లో 400 స్కూలు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా 299 మాత్రమే ప్రకటించారు. అంటే స్కూలు అసిస్టెంట్లలో 100 పోస్టులకు పైగా కోత పెట్టారు. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో 730 ఖాళీలు ఉంటే 300 పోస్టులకుపైగా వదిలేసి కేవలం 410కి మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. టీజీటీ 93 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు, దీనిపై నిరుద్యోగులు పెదవి విరుస్తున్నారు.

ఆశా వర్కర్లపై ఆంక్షలు

- 120 మందికి నోటీసులు
- సీఐటీయూ నేతలపై నిఘా
- బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లలో పోలీసు పికెట్లు


ఆశాల కోసం రాయవరం రైల్వే స్టేషన్‌లో ఆరా తీస్తున్న పోలీసులు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి 7: ఆశా వర్కర్ల ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గురువారం చలో విజయవాడకు పిలుపునిచ్చిన విషయం విదితమే. సీఐటీయూ అందుకు మద్దతు తెలిపింది. దీంతో జిల్లా నుంచి ఆశా వర్కర్లు ఎవరూ ఆ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈమేరకు ఎస్పీ మలికగర్గ్ పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇప్పటికే జిల్లాలో ముఖ్యమైన ఆశావర్కర్లు 120 మందిని గుర్తించి వారికి నోటీసులు జారీచేశారు. సీఐటీయూ నాయకులకు సైతం ముందస్తు నోటీసులు అందజేశారు. అదేక్రమంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. విజయవాడ వైపు వెళ్లే రహదారులపై వాహన తనిఖీలు చేపట్టారు. ఆశా వర్కర్ల కదలికలపై నిఘా ఉంచారు. రైళ్లల్లో ఇతర జిల్లాల నుంచి వచ్చేవారిని సైతం గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌కు సీఐటీయూ నాయకులు గంటెనపల్లి శ్రీనివాసరావు, శ్రీరాం శ్రీనివాసరావులను సీఐ జగదీష్ పిలిచి నోటీసులు ఇచ్చారు. విజయవాడ వెళ్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోస్టుల భర్తీ ఇక రాష్ట్రస్థాయిలో..

- మౌఖిక ఆదేశాలు ఇచ్చిన వైద్యశాఖ
- ఉద్యోగ నియామకాల్లో అవకతవకలను నిరోధించేందుకే అంటున్న అధికారులు



ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 7 : వైద్యశాఖలో పోస్టుల భర్తీ ప్రక్రియ ఇక నుంచి రాష్ట్ర స్థాయి నుంచి చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల వైద్యశాఖ ఉన్నతాధికారులు ఆమేరకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకూ స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, రేడియాలజిస్టుతోపాటు వివిధ రకాల పోస్టులన్నింటినీ వైద్యారోగ్యశాఖ ద్వారా జిల్లా స్థాయిలో నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తున్నారు. ఖాళీలకు అనుగుణంగా ఏటా ఇలా రెండు, మూడు సార్లు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అయితే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యారోగ్యశాఖలో ఇష్టారీతిన నియామకాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యాధికారుల పోస్టుల మాదిరిగానే ఇతర ఉద్యోగాల భర్తీని కూడా రాష్ట్రస్థాయిలోనే చేపడితే ఎలా ఉంటుందన్న దానిపై చర్చ జరిగినట్లు సమాచారం. అందుకోసం రాష్ట్రస్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసి నోటిఫికేషన్ జారీ, నియామకం విషయమై కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వైద్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లాల వైద్యాధికారులతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఈవిషయాన్ని మౌఖికంగా చెప్పినట్లు తెలిసింది. జిల్లాల్లో పోస్టుల భర్తీపై కూడా దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. పోస్టుల భర్తీ రాష్ట్రస్థాయిలో చేస్తే అభ్యర్థులు ఇబ్బంది పడే పరిస్థితి కనిపిస్తోంది. అయితే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై ఎలాటి నిర్ణయం తీసుకుంటుందన్నది వేచి చూడాల్సి ఉంది.

డీఈవోగా సుభద్ర

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 7 : జిల్లా విద్యాశాఖాధికారిగా డి.సుభద్ర నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆమె ప్రస్తుతం కాకినాడలో ఉపవిద్యాధికారిగా పనిచేస్తున్నారు. ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న గుంటూరు పాఠశాల ఆర్జేడీ వీఎస్.సుబ్బారావును పాఠశాల విద్య కమిషనరేట్‌లో టెట్ జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు. పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీగా విజయనగరం డీఈవోగా పనిచేస్తున్న బి.లింగేశ్వరరెడ్డిని ఉద్యోగోన్నతిపై నియమించారు.


డీఈవోగా నియమితులైన శుభద్ర

ఎన్నికల పద్దు

- బుగ్గన బడ్జెట్‌పై పెదవి విరుపు
- వెలిగొండ, దొనకొండ కారిడార్‌ల ఊసే లేదు
- మిగతా కీలక ప్రాజెక్టుల ప్రస్తావన కరువు
- జిల్లా అంశాలకు కనిపించని ప్రాధాన్యం

ఒంగోలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఆయా రంగాల్లోని పథకాలు, ప్రాజెక్టులకు స్పష్టమైన కేటాయింపులు చేసే అవకాశం లేకపోగా మూడు మాసాలపాటు ప్రభుత్వ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఎన్నికల సమయంలో ప్రవేశపెడతారు. అయితే వార్షిక బడ్జెట్ పేరుతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.86 లక్షల కోట్లతో భారీగా ప్రవేశపెట్టారు. అయితే ఏఒక్క అంశానికి ప్రత్యేక కేటాయింపులు చూపకుండా ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో చేసిన సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు వాటి వల్ల ప్రజలు భారీగా అభివృద్ధి చెందారంటూ బుగ్గన బడ్జెట్ ప్రసంగంలో మాట్లాడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రచార సభల్లో చేసే ప్రసంగంలా బడ్జెట్ ప్రతిపాదిత ప్రసంగం ఉందన్న అభిప్రాయం వివిధ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ఆయా ప్రధాన రంగాలలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన కీలక అంశాలు, ప్రాజెక్టులు, ప్రత్యేక పథకాలను బడ్జెట్ ప్రసంగంలో బుగ్గన ప్రస్తావించగా అందులో మన జిల్లాకు చెందిన వాటికి ఎక్కడా ప్రాధాన్యత కనిపించలేదు. అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితుల తరలింపులో జాప్యం జరగడానికి నిధుల కొరత ప్రతిబంధకంగా మారింది. దాదాపు రూ.6వేల కోట్లు ఇప్పటివరకు ఖర్చు కాగా మరో రూ.3వేల కోట్లు అవసరం ఉంది. అయితే అంతటి కీలక ప్రాజెక్టు వేగంగా జరుగుతుందని పేర్కొన్నారే తప్ప ప్రత్యేక ప్రస్తావన, నిధుల కేటాయింపు కనిపించ లేదు. అలాగే దొనకొండ కారిడార్, ఆంధ్రకేసరి వర్సిటీ, నిమ్జ్, ట్రిపుల్ ఐటీ, వాటర్ గ్రిడ్, టిడ్కో ఇళ్లు, ఫిషింగ్ హార్బర్, ఇతరత్రా పలు అంశాల ప్రస్తావన కూడా నామమాత్రంగానే ఉంది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ కేటాయింపులకు అవకాశం లేకపోయినా కనీసం జిల్లాకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వ దూరదృష్టి కూడా అందులో ఎక్కడా కనిపించలేదన్న విమర్శలు విభిన్న వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.




వెలిగొండ సొరంగం



బోర్డుకే పరిమితమైన ఎంఎస్ఎంఈ పార్కు


చింతల సమీపంలో టీడీపీ హయాంలో నిర్మించి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లు

అబద్ధాలు.. తప్పుడు లెక్కలు



బుగ్గన బడ్జెట్ ఎన్నికల ప్రచార కరపత్రం లా ఉంది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఏదో చేసిందన్న గొప్పలు చెప్పుకునేందుకు ప్రయత్నించారు. సంక్షేమం పేరుతో మోసం చేశారు. అభివృద్ధిని అటకెక్కించిందని ప్రజలంతా గుర్తించడంతో దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. తప్పుడు లెక్కలు, అబద్ధపు ప్రచారాలు అధికంగా ఉన్నాయి. కాగ్ రిపోర్టుకు, బడ్జెట్‌లో లెక్కలకు ఉన్న వ్యత్యాసాలే అందుకు నిదర్శనం.

- డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కొండపి ఎమ్మెల్యే

ఎన్నికల ప్రచారంలా బడ్జెట్



అన్నీ తప్పుడు లెక్కలు, గణాంకాలే తప్ప నమ్మదగినట్లు ఏమీ లేవు. జీడీపీలో మన పరిస్థితి 16వ స్థానంలో ఉన్నా బుగ్గన బడ్జెట్‌లో దానిని తప్పుగా చెప్పారు. అప్పుల ఊబిలో రాష్ట్రం కూరుకుపోయింది. వెలిగొండ, దొనకొండ పారిశ్రామిక కారిడార్ ప్రస్తావన కూడా లేదు. జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది.

- ఎం.ఎల్.నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి

వెలిగొండకు మొండిచెయ్యి



బుగ్గన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్‌లో వెలిగొండకు మొండిచేయి చూపారు. పారిశ్రామిక పురోగతికి కేటాయింపులు లేవు. జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. వెలిగొండ నిర్వాసితుల ప్యాకేజీ ప్రస్తావనే లేదు. టిడ్కో ఇళ్లు, ఏకే వర్సిటీకి నిధులు వంటివి ఏమీ లేవు.

- జీవీ కొండారెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు

పశ్చిమ ప్రాంత ప్రజలకు బ్లాక్‌డే



వెలిగొండకు నిధుల కేటాయింపు విషయమై బడ్జెట్‌లో ప్రస్తావన కూడా లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని ఇస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా విస్మరించారు.

ఎస్.శ్రీనివాసులు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు

అట్టహాసంగా క్విస్ ఫెస్ట్



వేడుకలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరాజు, సూర్యకల్యాణచక్రవర్తి, అతిథులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 7: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల నిర్వహించనున్న క్విస్ ఫెస్ట్-2024 బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్‌టీయూకే వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డీవీ.ప్రసాదరాజు మాట్లాడుతూ క్విస్ ఇంజనీరింగ్ కళాశాల అనతికాలంలోనే రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందిందన్నారు. ఎన్‌బీఏ, నాక్, అటానమస్ హోదాలు సాధించి ప్రముఖ విశ్వవిద్యాలయాలతో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల పోటీపడుతుందని ఆయన అభినందించారు. కర్నూలు ట్రిపుల్‌ఐటీ డీఎం డైరెక్టర్ డీవీఎస్ఎల్.సోమయాజులు మాట్లాడుతూ క్విస్ కళాశాల దేశంలోనే అత్యధిక ఇన్‌టేక్ కలిగి ఉండటంతో పాటు విద్యార్థులను సాంకేతికతతో నిష్ణాతులుగా తీర్చిదిద్దడంతో ముందంజలో ఉందన్నారు. కృత్రిమ మేధస్సు డేటాసైన్స్‌లో తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ఇస్రో మాజీ డైరెక్టర్ డాక్టర్ టీవీ.సుబ్బారావు మాట్లాడుతూ కళాశాలలో ఐడియా ల్యాబ్‌లు, ఎస్‌ఐహెచ్ ఎస్‌ఐ ల్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ ప్రసాదరాజు ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీగాయత్రిదేవి, ప్రిన్సిపాల్స్ వై.హనుమంతరావు, డి.దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం

● రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



ప్రచారం నిర్వహిస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ తెలిపారు. బుధవారం నగరంలోని 3వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ఇంటిటికీ వెళ్ళి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ హయంలో జరిగిన అభివృద్ధిని వివరించడంతోపాటు, వైసీపీ పాలనలో జరిగిన నష్టాలను ప్రజలకు వివరించారు. సైకో పాలనలో ప్రజలకు తీరని నష్టం జరిగిందన్నారు. ఇసుక, మైనింగ్, మద్యం పేరుతో భారీగా దోచుకుని సామాన్యప్రజల జీవనోపాధిని దూరం చేసిన వైసీపీకి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఇలాంటి దుర్మార్గపు పాలన రాష్ట్ర ప్రజలు ఎన్నడూ చూడలేదన్నారు. కరెంటు, ఆర్టీసీ చార్జీలు పెంచి, చెత్తపై పన్ను విధించి, ఏటా ఇంటి పన్నులు పెంచేసిన ఘనుడు జగన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తే ప్రజలు రాష్ట్రం విడిచిపోవాల్సిందే అని విమర్శించారు. ఇప్పటికైనా విజ్ఞులైన ఓటర్లు తెలుగుదేశం పార్టీని గెలిపించి అభివృద్ధి సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, వజీఈ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కొక్కిలిగడ్డ సముద్రాలు తదితరులు పాల్గొన్నారు. కాగా డివిజన్‌లోని మహిళలు, కార్యకర్తలు దామచర్లకు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో 14వ డివిజన్ టీడీపీ నాయకులతో జనార్దన్ సమావేశం అయ్యారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

డీటీసీ సుశీల

పలుశాఖల అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్ష చేస్తున్న డీటీసీ సుశీల

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని రవాణా శాఖ ఉప కమిషనర్ (డీటీసీ) ఆర్.సుశీల ఆదేశించారు. బుధవారం ఒంగోలు నగరం వెంగముక్కపాలెంరోడ్డులో గల రవాణాశాఖ కార్యాలయంలలో సిపోజియం ఆన్ రోడ్ సేఫ్టీ ఆడిట్ కార్యక్రమం జరిగింది. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అంతేకాకుండా ఇటీవల ప్రమాదాలు జరిగిన ప్రాంతాలపై విశ్లేషణ చేశారు. పెద్దారవీడు మండలం దేవరాజుగుట్ట సమీపంలో ఫ్లైఓవర్ వద్ద జరిగిన ప్రమాదం, దర్శి వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై చర్చించారు. మార్కాపురం బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలని నిర్ణయించారు. చినారకట్ల, పెదారకట్ల, రాయవరం, బేస్తవారపేట ప్రాంతాలలో రోడ్ల ఆక్రమణకు గురై పాదచారులు నడిచేందుకు వీలులేకుండా పోయిందని, అందువల్ల ఆక్రమణలు తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక ఒంగోలులోని పేస్, రైజ్ ఇంజనీరింగ్ కళాశాలల వద్ద సర్వీస్ రోడ్లు వేయటంతోపాటు రోడ్డు మార్కర్లు, స్పీడు బేకర్లు ఏర్పాటు చేయాలని, రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్‌ఈ కె.దేవానదం, హైవే ప్రతినిధులు, మార్కాపురం ఆర్టీవో బి.అమర్‌నాయక్, ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, కె.రామచంద్రరావు, ఎల్.సురేంద్రప్రసాద్, ఎం.జగదీష్, పి.రవికుమార్, జయప్రకాష్, కె.రవినాయక్ పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుడిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: కనిగిరి పట్టణానికి చెందిన పేద బ్రాహ్మణుడు పంచాంగునుల వెంకటసుబ్బయ్య, ఆయన కుటుంబసభ్యులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. ప్రజాసంఘాలు, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్, తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సంఘాల నాయకులు బుధవారం సామూహికంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. గత మూడు నెలలుగా పేద బ్రాహ్మణుడికి తమ పెద్దల ద్వారా సంక్రమించిన భూమిని కనిగిరికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు జి.పవన్‌కుమార్, మరికొంత మంది అన్యాయంగా నకిలీ రిజిస్ట్రేషన్ చేయించుకుని వేధిస్తున్నారని చెప్పారు. అంతేగాకుండా భూమియజమానులైన వెంకటసుబ్బయ్య ఆయన కుమార్తె పద్మజ, అల్లుడు జనార్దన్, మరికొంత మందిపై కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వెంకటసుబ్బయ్య ఆస్తిని అక్రమంగా చేసి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి అక్రమ కేసును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుసుమకుమారి, దూళిపాల మల్లికార్జునరావు, తోరటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ సముచిత స్థానం కల్పించే విధంగా పార్టీ అధినేత బోడే రామచంద్రయ్య నిర్ణయం తీసుకున్నారని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీసీవై అధికారంలోకి వస్తే రెండేళ్లు ము ఖ్యమంత్రిగా బీసీలకు, మరో రెండేళ్ళు కాపులకు, మరో ఏడాది ఎస్సీలకు అవకాశం కల్పిస్తామని రామచంద్ర యాదవ్ ప్రకటించారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఈ విధంగా ముఖ్యమంత్రి పదవిని మూడు భాగాలుగా విభజించిన పరిస్థితి లేదన్నారు. అన్ని వర్గాలకు రాజ్యాధికారంలోకి రావాలంటే బీసీవై పార్టీ ద్వారానే సాధ్యవుతుందని తెలిపారు. రామ చంద్రయాదవ్ తీసుకున్న నిర్ణయాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతించాలని కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి పాలఅభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌గఫూర్, విస్తర్ల శంకరయ్య, అద్దంకి సామ్రాజ్యం, రాములు, మాధవ, దుర్గా భవాని, పద్మావతి దేవేందర్, అప్పారావు, గోపీకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఆదివాసి మేనిఫెస్టో ఆవిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: ఎన్నికల మేనిఫెస్టో ప్రజల భవిష్యత్‌తో పాటు రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంబంధించిన రాజకీయ పార్టీలు ఇచ్చే భరోసా అని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కె.పేరయ్య అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ దళిత ఆదివాసి మేనిఫెస్టో-2024 ఆవిష్కరణ కార్యక్రమం రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పేరయ్య మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన ప్రతి రాజకీయ పార్టీకి ప్రథమ సవాలన్నారు. ప్రజలందరూ ఆమోదం పొందేలా మేనిఫెస్టో రూపొందించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఈగ శ్రీనివాసరావు, గుత్తి కోటేశ్వరరావు, గుంటూరు నాగమణి, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలను విడుదల చేయాలి



కమిషనరుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 7: ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఆప్కాస్, కొవిడ్ పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం కమిషనరు ఎం.జశ్వంత్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు, చెత్త ఆటో డ్రైవర్లకు జీతాలు మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే కార్మికులు సమ్మె సమయంలో చేసిన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తంబి శ్రీనివాసరావు, కె.సామ్రాజ్యం, కొర్నెపాటి శ్రీనివాసరావు, టి.విజయ, ఆర్.రాములు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటరు కార్డుల పంపిణీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: ఒంగోలు నియోజకవర్గంలో కొత్త ఓటర్లకు ఒపిక్(కొత్త ఓటరు కార్డులు) పంపిణీ చేస్తున్నట్లు ఆర్డీవో విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఓట్ల నమోదు, చేర్పులు మార్పుల కోసం వచ్చిన దరఖాస్తుల విచారణను వెంటనే చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం అంశాల వారీగా వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, డీటీలు అజయ్‌కుమార్‌రెడ్డి, ఫిరోజ్ బాషా, అర్జున్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రాంతికుమార్, కటారి సంజీవ్, రసూల్, గుర్రం సత్యం, రమేష్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కురిచేడులో స్పందన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: కురిచేడులో ఈనెల 9వతేదీన మండలస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం తెలిపారు. కురిచేడులోని గుంటక నరసారెడ్డి కళ్యాణ మండపంలో స్పందన జరుగుతుందని, మండల ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 16న తర్లుబాడు, 23న తాళ్ళూరులో స్పందన కార్యక్రమాలు జరుగతాయని ఓ ప్రకటనలో తెలిపారు.

అట్టహాసంగా ప్రమాణస్వీకారం



నియామకపత్రం అందుకుంటున్న సుభాని

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: బీసీ సంక్షేమ సంఘం జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడిగా ఎస్‌ఎం.సుభాని ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఒంగోలు నగరం గోపాలనగరంలోని శ్రీగోపాలకృష్ణ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీల సంక్షేమం కోసం పాటుపడటతంతో పాటు సంఘ సభ్యులకు రాయితీపై వైద్య పరీక్షలు అందేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం సుభానిని ఘనంగా సత్కరించారు. అంతకు ముందు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోనుగుంట్ల బ్రహ్మానందశర్మ, బలగాని ఆంజనేయులు, కేవీ.శేషమ్మ, బెల్లంకొండ నాగరాజు, ఎస్‌కే.అజీజ్, డి.పుల్లయ్య, ఎ.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 7: మార్చి 1నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు తాత్కాల్ పథకం పొడిగిస్తూ ఇంటర్ విద్యా కార్యదర్శి సౌరబ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.3వేల అపరాధ రుసుంతో ఈనెల 10వ తేదీ వరకు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేటు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 60 సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులు, అలాగే గర్భిణులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఎన్నికల విధులు టెన్షన్‌తో కూడుకున్నందున వీరికి మినహాయింపు ఇవ్వాలన్నారు.

మూడో రోజుకు చేరిన పెన్షనర్ల రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీఆర్పీఏ గౌరవ సలహాదారు మీగడ వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం ఏపీఆర్పీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు మూడో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పెన్షనర్లు, ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రయోజనాలను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రధాన కార్యదర్శి సీహెచ్.రాంబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వాలని, అలాగే పీఆర్సీ, డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో టీవీఆర్.సుబ్బారావు, వి.మాలకొండారెడ్డి, కె.కృష్ణమూర్తి, జీవీ.కొండారెడ్డి, పి.పేరయ్య, ఏవీ.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఒమ్మెవరం స్త్రీనిధి నిధులు

గోల్‌మాల్‌పై చర్యలు శూన్యం

ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు, అధికారులు

డ్వాక్రా మహిళలు ఆవేదన

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి7: నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామంలో స్త్రీనిధి నిధులు గోల్‌మాల్‌పై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నిధుల గోల్‌మాల్‌పై నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా బాధ్యుతలపై ఎలాంటి చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది. డ్వాక్రా మహిళలకు కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవటంతో గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వీవోఏ కోట అనిత, ఆమె కుమారులు, వెలుగు ఏపీఎం, సీసీలు కలిసి ఈ గోల్‌మాల్‌కు పాల్పడ్డారని డ్వాక్రామహిళలు ఆరోపిస్తున్నారు. అయితే అనితతో పాటు ఆమె కుమారులు ఇద్దరు కలిసి గ్రామం వదిలి కనపడకుండా పోయారు. మహిళల ఫిర్యాదు మేరకు వెలుగు స్త్రీనిధి ఏజీఎం హర్షకుమార్ గ్రామంలో విచారణ చేపట్టారు. అయితే సదరు విచారణ నివేదికను ఇంతవరకు బయటపెట్ట లేదు. సాధారణంగా బ్యాంక్ నుంచి స్త్రీనిధులు తీసుకోవాలంటే ఏపీఎం, సీసీల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఇక్కడ అయితే వెలుగు ఏపీఎం, సీసీల నుంచి అనుమతి తీసుకొని స్త్రీనిధి నిధులు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. బ్యాంక్ నుంచి నగదు తీసుకోవాలంటే డ్వాక్రాగ్రూపు మహిళలు సంతకాలు కూడా తీసుకోవాలి. అయితే వీవోఏ డ్వాక్రా మహిళలు సంతకాలను ఫోర్జరి చేసి బ్యాంక్ నుంచి నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాధిత మహిళలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రామతీర్థం జలాశయంలో మీనోత్సవం



చేపపిల్లలను వదులుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి, ఫిబ్రవరి7 : రామతీర్థం జలాశయం వద్ద బుధవారం మీనోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద 1.60లక్షల చేపపిల్లలను జలాశయంలోకి వదిలే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు చేతులమీదుగా చేపపిల్లలను జలాశయంలోకి వదిలారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎ.ఉషాకిరణ్, మత్స్య శాఖ అధికారి ఆషా, మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఏడుకొండలురెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను ప్రారంభించాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

టంగుటూరు, ఫిబ్రవరి 7: ఉపాధి పనులను ప్రతి గ్రామంలో వెంటనే ప్రారంభించాలని డ్వామా ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటస్వామి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం టంగుటూరు, జరుగుమల్లి, కొండపి మండలాల్లో ఉపాధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ మండలానికి ఇచ్చిన లక్ష్యానికి తగినట్లు కూలీలను సమీకరించి పనులు చేపట్టాలని సూచించారు. త్వరలో ఎన్నికల కోడ్ రానున్నందున ఏడాదికి సరిపడా పనులను సిద్ధం చేసుకోవాలన్నారు. ఏగ్రామంలో పని కల్పించకపోయినా అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్, సంబంధిత సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టంగుటూరు ఎంపీడీవో సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పనులు ప్రారంభించాలని సూచించారు. సమీక్షలో ఏపీడీ, మూడు మండలాల ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

షార్ట్‌సర్క్యూట్ కారణం

సకాలంలో స్పందించిన పోలీసులు, ఫైర్ సిబ్బంది



చివరి అంతస్తులో రేగుతున్న మంటలు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 7: ఒంగోలు నగరం నిర్మల్ నగర్‌లోని రెడ్డి అపార్ట్‌మెంట్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి స్వల్పంగా నష్టం జరిగింది. బుధవారం రాత్రి బెడ్ రూంలో ఉన్న ఏసీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 60 అడుగుల రోడ్డులోని సూర్య ఆసుపత్రి యజమాని సంజీవరెడ్డి రెడ్డి అపార్ట్‌మెంట్‌లో ఆరో ఫ్లోర్‌లో నివాసముంటున్నారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత ఆయన గదిలో ఏసీ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో అప్రమత్తమై అటు పోలీసు, ఇటు అగ్నిమాపక శాఖలకు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక అధికారులు, తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతోపాటు అపార్టుమెంట్‌లో ఉన్నవారిని బయటకు తీసుకొచ్చి రక్షించారు. ప్రమాదం జరిగిన రూంలో బెడ్‌తోపాటు కొన్ని కీలక ఫైల్స్ తగలబడినట్లు సమాచారం. తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు పున్నారావు, కిషోర్ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు.

143 మద్యం బాటిళ్లు స్వాధీనం

● సూపర్‌వైజర్, సేల్స్‌మన్ అరెస్టు

పీసీపల్లి, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 143 మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సెబ్ సీఐ వీరవల్లి సైమన్ తెలిపిన వివరాల మేరకు... పెదయిర్లపాడు మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందింది. సిబ్బందితో అక్కడకు వెళ్లగా కారు, ద్విచక్రవాహనాలలో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సాయిక్రిష్ణారెడ్డి, సేల్స్‌మన్ వినోద్‌కుమార్‌లుగా గుర్తించారు. వీరి వద్ద 143(180ఎమ్‌ఎల్ పరిమాణం గల)మద్యం బాటిళ్లు, కారు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

10న అద్దంకికి మఠాధిపతులు రాక

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 7: ఈశ్వరిదేవి మఠం ఆ స్థాన మఠాధిపతులు వీరశివ కుమార స్వాములు ఈ నెల 10వ తేదీన అద్దంకిలోని కాకానిపాలెంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి రానున్నారని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం స్థానిక ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కుమార స్వామి పర్యటనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, కలశ స్థాపన, అభిషేకం, 108 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, శాంతి హోమం వంటి పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పూజలలో పాల్గొనే వారు 9వ తేదీలోపు 9063239129 నెంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.



పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన పోతురాజుకాలువ



అరవై అడుగుల రోడ్డులో డ్రైనేజీ కాలువ ఇలా..

ప్లాస్టిక్ వ్యర్థాల మురుగు కూపం..!

అధ్వానంగా పోతురాజు కాలువ ● ప్రమాదంలో ప్రజారోగ్యం



దుర్వాసనతో ముక్కు మూసుకుని వస్తున్న విద్యార్థినులు

నగరంలోని మురుగునీటి ప్రవాహానికి ప్రధాన మార్గంగా ఉన్నటువంటి పోతురాజు కాలువ పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. పట్టించుకునేవారు లేకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాల కూపంగా మారింది. వ్యర్థాలు భారీగా పేరుకుపోయి దుస్థితికి చేరుకుంది. పోతురాజు కాలువ ఆధునికీకరణ కోసం తెలుగుదేశం పార్టీ హయాంలో పనులు చేపట్టారు. దీంతో కొంతమేర మురుగుకాలువ వ్యవస్థ మెరుగుపడగా, తదనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. అందుకోసం నాయకులు కాలువ పరిశీలన చేశారు. అయితే ఆ పనులు నేటికి పురోగతికి నోచుకోలేదు. దీంతో ప్రస్తుతం పోతురాజు కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి మురుగునీరు ప్రవహించే వీలు లేకుండా పోయింది. దీనిపై సమీప శివారుకాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మురుగు వాసన, మరోవైపు దోమల బెడదతో ఆవేదన చెందుతున్నారు. అధికారులు, పాలకులు, ప్రజారోగ్యాన్ని పెడచెవిన పెడుతున్నారనేదానికి ఈ ఫొటోలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

\- ఒంగోలు (కార్పొరేషన్)

ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కొత్తపట్నం(ఒంగోలునగరం) ఫిబ్రవరి 7: జగనన్న లేఅవుట్లలో పేదలకు ఇచ్చిన ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని అల్లూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అల్లూరులో 318 మందికి ఇంటిపట్టాలను మంజూరు చేయగా వీరిలో ఇప్పటివరకు 186 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ ఇంటిపట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ధృడసంకల్పంతో ఉందన్నారు. వీరికి ఇంటిస్థలం, ఇంటిపై సర్వహక్కులు కల్పించేందుకు పట్టాను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందన్నారు. ఈ ప్రక్రియ మిషన్ మోడ్‌లో జరగాలన్నారు. మిగిలిన పట్టాలను కూడా రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని జగనన్న లేఅవుట్లలో పట్టాలు పొందిన పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఆర్ సంస్థ కృషి అభినందనీయం

బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు కార్పొరేట్ తరహాలో సౌకర్యాల కల్పించిన జీవీఆర్ సంస్థ కృషి అభినందనీయమని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. రూ.11.04 లక్షలతో కొత్తపట్నంలోని బాలికల వసతిగృహంలో జీవీఆర్ సంస్థ కల్పించిన సౌకర్యాలను బుధవారం కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నాడు-నేడు పథకం కింద రాష్ట్రప్రభుత్వం కూడా పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. దీనికితోడుగా కార్పొరేట్, స్వచ్ఛంధ సంస్థలు కూడా తమ వంతు సహకారం అందించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జీవీఆర్ సంస్థ ప్రతినిధులు పెద్ద మనసుతో వసతి గృహంలో అవసరమైన నీటి వసతి, ఫ్యాన్లు, బెడ్‌లు, ఇతర సౌకర్యాలను కార్పొరేట్‌తరహాలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. బాలికలకు మంచి వసతులు కల్పించేందుకు కృషి చేసిన జీవీఆర్ సంస్థ మేనేజర్ పిన్ని బంగారయ్య, పిన్ని వెంకటేశ్వర్లును కలెక్టర్ దినేష్‌కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, సంక్షేమాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్వామి మళ్లీ గెలుపుతోనే కొండపి అభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సత్య



ఉప్పలదిన్నెలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సత్య

పొన్నలూరు (కొండపి), ఫిబ్రవరి 7 : కొండపి ఎమ్మెల్యేగా తిరిగి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విజయం సాధిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. మన గ్రామానికి మన సత్య కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని ముప్పాళ్ల, సింగరబొట్లపాలెం, వెల్లటూరు, మంగపతివారిపాలెం, హాజీపాలెం, వేంపాడు, ఉప్పలదిన్నె, రావులకొల్లు, తేటుపేట, వెంకుపాలెం, ముండ్లమూరివారిపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల్లో ఓటరు జాబితాలను పరిశీలించాలని, ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటేసే విధంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈసందర్భంగా పాలేరు తీరగ్రామాల వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు నాలుగున్నరేళ్లుగా ఇసుకను అక్రమంగా తవ్వుకుని సొమ్ము చేసుకున్నారని సత్యకు వివరించారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, సీనియర్ నాయకుడు బంగారయ్య, మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండవ ప్రసాద్, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, దాసరి కృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఐదేళ్లుగా కదలని శుద్ధిజల ప్లాంటు

పూర్తిగా నిలిచిపోయిన పథకం పనులు

పట్టించుకోని ప్రభుత్వం



శింగరకొండ వద్ద భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టేక్‌వెల్ (ఇన్‌సెట్లో) నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంక్



అద్దంకి, ఫిబ్రవరి7: గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరకు శుద్ధి జలం అందించాలన్న ఉద్దేశంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శింగరకొండ వద్ద రూ. 1.50 కోట్ల వ్యయంతో శుద్ధి జల ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. అద్దంకి, బల్లికురవ మండలాలలోని 21 గ్రామాల ప్రజలకు తక్కువ ధరలో ఈ జలాన్ని ఇళ్ల వద్దకే సరఫరా చేసే విధంగా ప్లాంట్ రూపకల్పన చేశారు. 2018 ఫిబ్రవరి 16 వ తేదీని అప్పటి కలెక్టర్ వినయ్‌చంద్, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం భవనాసి చెరువులో ఇన్‌టేక్ వెల్ నిర్మాణం, అక్కడ నుంచి శింగరకొండ వద్ద ట్యాంక్ వరకు పైప్‌లైన్ నిర్మాణం జరిగాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు శుద్ధిజలం సరఫరా ఎండమావిగానే మారాయి. ఆయా గ్రామాలలో ప్రయివేట్ వాటర్ ప్లాంట్‌ల ద్వారా ఎక్కువ ధరకు జలాన్ని ప్రజలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగిన పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

69 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

మేదరమెట్ల , ఫిబ్రవరి 7: తిమ్మన్నపాలెం వద్ద రేషన్‌బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం వేకువజామున మేదరమెట్ల వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న రేషన్‌బియ్యం లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వాసుదేవరావు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లారీలో ఒక్కోటి 50 కేజీల బరువు ఉన్న 69 బస్తాలను పట్టుకుని కేసు నమోదు చేశారు. బియ్యాన్ని రేషన్ డీలర్‌కు అప్పగించడంతో పాటు లారీని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు మేదరమెట్ల ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

తీరంలో అనుమానాస్పద మృతదేహం

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 7 : చీరాల మండల పరిధిలోని వాడరేవు సముద్రతీరంలో బుధవారం సుమారు 60 ఏళ్ల వృద్ధుడి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణ, ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు బ్లూ రంగు చొక్కా, నలుపురంగు ఫ్యాంటు, షూ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

స్పందనలో ఫిర్యాదులపై విచారణ

మార్టూరు , ఫిబ్రవరి 7: కలెక్టర్ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ సీహెచ్.శ్రీధర్ మార్టూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. గత ఏడాది డిసెంబర్ 31 తేదీన మండలంలోని కోణంకి గ్రామంలో ఫాం 7పై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా భారీగా పోలీసులు వచ్చారు. ఓట్ల విచారణలో ఫాం 7కు సంబంధించి లబ్ధిదారులను విచారణ చేసేందుకు రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్న సమయంలో సందెపోగు శోభారాణి, భార్య భర్తలు జొన్నలగడ్డ రామయ్య, రిబకా దంపతులు ఓట్ల విచారణలో పోలీసులు తమను భయభ్రాంతులకు గురి చేశారని జనవరి నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారులను విచారించారు. అదే విధంగా కోణంకి గ్రామానికి చెందిన ఉప్పలపాటి అశోక్ తన ఓటు తొలగించారని స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించారు. ఈ గ్రామంలో గ్రామానికి చెందిన ఒ క వ్యక్తి భారీగా ఓటర్లను తొలగించాలనే ఉద్దేశంతో భారీగా ఫాం7లు దాఖలు చేశారు. అయితే వారు అందరు తాముకు ఓటు హక్కు ఉన్నట్లు సంబంధిత పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. ఈ విషయమై జేసీ శ్రీధర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, స్పందనలో ఫిర్యాదు దారులు ఇచ్చిన అర్జీ మేరకు, కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశామని తెలిపారు.

అవీ..ఇవీ..

12న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలునగరం, ఫిబ్రవరి 7: ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఈ నెల 12వ తేదీన జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్ బుధవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బాలుర ఐటీఐ ఆధ్వర్యంలో ఈ మేళా జరుగుతుందన్నారు. హెటిరో డ్రగ్స్, తిరుమల ఆటోమోటివ్స్, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్, తిరుమల ఆటోమోటివ్స్ కంపెనీల్లో జూనియర్ కెమిస్టు, ఐటీఐ, టెక్నీషియన్, మెషిన్ ఆపరేటర్, సహాయకుల పోస్టుల భర్తీకి ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, ఇంటర్, డిప్లమా, పదో తరగతి, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ జాబ్ మేళా జరుగుతుందని, ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 7989244381 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎర్రగుడిపాడు డొంక వద్ద గుర్తుతెలియని మృతదేహం



మృతదేహన్ని పరిశీలిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి, ఫిబ్రవరి7 : మండలపరిధిలోని ఎర్రగుడిపాడు డొంక సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం రాత్రి రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు చీమకుర్తి పోలీసులు పరిశీలించారు. సీఐ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. బ్లూ రంగు నిక్కరు,మెడలో తాడు కల్గిఉన్న పురుష శవానికి సుమారు 40సంవత్సరాలు వయస్సు ఉంటాయని ప్రాథమికంగా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ వ్యక్తిని గుర్తించే పనిలో ఉన్నారు.

ఆర్థిక సంఘం నిధులతోనే స్థానికసంస్థలు బలోపేతం



మాట్లాడుతున్న రత్నకుమారి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారానే గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఆర్థికంగా బలబడతాయని ఐదవ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్‌పర్సన్, ప్రొఫెసర్ రత్నకుమారి పేర్కొన్నారు. ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో బుధవారం జరిగిన ఐదవ రాష్ట్ర ఆర్థిక సంఘానికి నూతనంగా ఏర్పడిన చైర్‌పర్సన్, కమిటి సభ్యులు సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. కమిటీ సెక్రటరీ కేవీ.రమణారెడ్డి, సభ్యులు కె.కృపారావు, ప్రసాదరావు, పద్మారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లాలో ఆర్థిక వనరుల లభ్యత, వాటి వ్యయాలు, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. అనంతరం చైర్‌పర్సన్‌గా తొలిసారిగా జిల్లాకు వచ్చిన రత్నకుమారిని, సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీవో జీవీ.నారాయణరెడ్డి, జడ్పీ సీఈవో జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలను రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి



మాట్లాడుతున్న సహాయ కమిషనర్ కనకదుర్గాభవానీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం -1988 కింద సంబంధిత సంస్థల యజమానులు వి.ధిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ కె.కనకదుర్గా భవానీ సూచించారు. బుధవారం ఒంగోలులో మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించుకొని లైసెన్సులు పొందాలని సూచించారు. ఆయా సంస్థల యజమానులు ఆన్‌లైన్ ద్వారా లేదా సమీపంలో సచివాలయాలు, మీసేవకేంద్రాల ద్వారా ఈనెల 29వతేదీలోపు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమలో సహాయ కార్మిక అధికారులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.ఎలిజబెత్తమ్మ, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు జి.వెంకొరెడ్డి, వేమూరి సుబ్బారావు, వి.ఏడుకొండలు పాల్గొన్నారు.

బాలోత్సవ్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆనందరావు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 7:తొలిసారిగా నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో కళకారులు, విద్యార్థులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని బాలోత్సవ్ నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షులు, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు కోరారు. బుధవారం స్థానిక ఎల్బీజీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీలలో స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే బాలోత్సవ్‌లో 50 రకాల అకడమిక్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ కన్వీనర్ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు మనోవికాసానికి ఇటువంటి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రోటరీ క్లబ్ సెంట్రల్ నాయకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒంగోలులో ఈ విధమైన కార్యక్రమం నిర్వహించటం ఎంతో అభినందనీయం అని చెప్పారు. సమావేశంలో కొమ్మోజి శ్రీనివాసరావు, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, కె.సుబ్రహ్మణ్యాచారి, వి.బాలకోటయ్య దామా శ్రీనివాసులు, సీహెచ్.వినోద్, కేఎఫ్.బాబు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి హౌస్‌వైరింగ్‌పై శిక్షణ

ఒంగోలు నగరం,ఫిబ్రవరి 7: రూడ్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి జిల్లాలోని నిరుద్యోగులకు హౌస్‌వైరింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని, ఉచిత వసతి, భోజనసౌకర్యం శిక్షణ కాలంలో కల్పిస్తామన్నారు. వివరాలకు ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని రూడ్‌సెట్ కార్యాలయంలో గానీ, లేదా 9492583484 సెల్ నంబరులో కానీ సంప్రదించాలని ఆయన కోరారు.

వైసీపీకి రాజీనామా

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి7: నాగులుప్పలపాడు మండలం చేకూరుపాడు గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ యర్రా దశరథరామయ్య వైసీపీకి రాజీనామా చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గ వ్యవసాయసలహా మండలి చైర్మన్ పదవికి. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం రాత్రి తెలిపారు. మండలంలో వైసీపీ పరిస్థితి బాగా లేదని, ఎవరి దారి వారిది కావటంతో కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతున్నట్లు చెప్పారు. తదుపరి ఒక వారంలో తన రాజకీయ నిర్ణయం తెలియజేస్తానని తెలిపారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

● ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు

ఒంగోలు(క్రైం) ఫిబ్రవరి 7: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహిచేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ కిషోర్‌బాబు ఆదేశించారు. బుధవారం స్థానిక ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రౌడీ షీటర్లు, ఎలాంటి కేసులు నమోదు అవుతున్నాయని అడిగి తెలసుకున్నారు. అదే విధంగా సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కొత్తపట్నం బస్టాండ్ సమీపంలో గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సీఐ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

18 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో ఎస్సై నాగేశ్వరరావు

టంగుటూరు, ఫిబ్రవరి 7: టంగుటూరులోని బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కాకుటూరివారి పాలెంకు చెందిన కొత్తపల్లి జోగిబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 18 మద్యం బా టిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

సురక్ష సేవలను వినియోగించుకోవాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 7 : ఆరోగ్య సురక్ష వైద్య సేవలను పేదలు వినియోగించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్డీ రామకృష్ణారావు కోరారు. కోటగడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య వైద్యశాల ఆవరణలో వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. వైద్యాధికారులు షరీఫ్, డాక్టర్ భార్గవరెడ్డి రోగులను పరీక్షించి మందులు అందచేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

» ఆర్‌డబ్ల్యూఎస్ అధికారికి టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు వినతి

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 7 : వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. ఈమేరకు బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏఈ శ్రీకాంత్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కొద్ది రోజులుగా ఎండలు మొదలయ్యాయని, గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండగా ట్యాంకర్ల నీటి సరఫరాను ఎందుకు నిలిపివేశారని ఎరిక్షన్‌బాబు ప్రశ్నించారు. గ్రామాల్లో తాగు నీరు లేక మహిళలు బిందెలతో రోడ్లపై ఆందోళనకు దిగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ట్యాంకర్ల యజమానులకు చెల్లించాల్సిన రూ.30కోట్లను విడుదల చేయలేని దుస్థితిలో వైసీపీ పాలన ఉందన్నారు. ఇటీవల తాము ఏ గ్రామానికి వెళ్లినా తాగునీరు ఇప్పించాలని వేడుకుంటున్నారని ఎరిక్షన్‌బాబు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఆయనవెంట టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటేశ్వర్లు, కాకర్ల కోటయ్య, రైతు అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, నాయకులు వేగినాటి శ్రీను, కంచర్ల సత్యనారాయణగౌడ్, తోట మహేష్, పాలడుగు వెంకటకోటయ్య, కొత్త భాస్కర్, జాగర్లమూడి గాలెయ్య, పోక వెంకటసుబ్బయ్య, షేక్ మస్తాన్ వలి, చేదూరి కిశోర్, కందుల నారాయణరెడ్డి మహిళా అధ్యక్షులు రమణమ్మ ఉన్నారు.


ఏఈకి వినతిని అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

వైసీపీని వీడి టీడీపీలోకి

» వ్యాపారులకు సహకారం అందిస్తా
» మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
» పార్టీలోకి 140 కుటుంబాలు చేరిక


పార్టీలో చేరిన ఆర్యవైశ్యులతో అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 7 : వ్యాపారాలు చేసుకునే ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మెయిన్‌బజారులో ఆర్యవైశ్య నాయకులు వాడకట్టు శివప్రసాద్ ఆధ్వర్యంలో 40 ఆర్యవైశ్య కుటుంబాలవారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో వ్యాపారులు అన్ని విధాలుగా నష్టపోయారని, జగన్‌రెడ్డి నిరంకుశ విధానాలతో వాణిజ్యరంగాలపై చేసిన దాడులు దారుణమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అవగానే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. వాడకట్టు శివప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో ఆర్యవైశ్య నాయకులు జిలకర సత్యనారాయణ, యోగేశ్వరరావు, దమ్మాల మధు, శివపురం వెంకటేశ్వర్లు, వాడకట్టు చిన్నసత్యనారాయణ, రాచపాటి నరసింహారావు, వాడకట్టు సాయి, నటుకుల సాయి, నటుకుల శ్రీను, నాగరాజు, శివపురం వెంకటరామయ్య, గోపాల్, శేగు కిరణ్, సూరె నాగేశ్వరరావు, శింగరి రంగస్వామి, తుమ్మలపెంట మోహన్, ఎం.శ్రీనివాసులు, కె.రామక్రిష్ణ, ఎం.సత్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం 18వ వార్డులో బాబుష్యూరిటి భవిష్యత్‌కు గ్యారెంటీ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వార్డుకు చెందిన సాదనబోయిన శ్రీనివాసులు, ఎస్.హసేన్‌బాషా, ఎం.రంగనాయకులు, బొంతా రంగస్వామి, ఎం.శోభన్‌బాబు, బి.కేశాలు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అశోక్‌రెడ్డి వారికి కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.


రాజుపాలెంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

100 కుటుంబాలు చేరిక

త్రిపురాంతకం : మండలంలోని గణపవరం, రాజుపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. గణపవరంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తుల లక్ష్మయ్య, గుంటక మహేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, అలవాల పెద్దనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గుంటక వెంకటేశ్వరరెడ్డి (కర్తమయ్య), మాజీ సర్పంచ్ నక్కా రోశయ్య, ఉప్పుతోళ్ల ఏసుబాబు, మాచర్ల దావీదు, వజ్రాల తిరుపతమ్మలతోపాటు సుమారు 100 కుటుంబాలు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరాయి. రాజుపాలెంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కందుల రమణారెడ్డి, మానికొండ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చల్లా వెంకటయ్య, తిరుపతి గురవయ్య, వెంకటరమణ, వీరయ్య, బండారు కొండలు, ఓర్సు బాబులతోపాటు సుమారు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కొత్తగా పార్టీలో చేరిన వారికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ జగన్ అరాచక పాలనకు ప్రజలు విసిగెత్తిపోయారని, గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, వీ ఆంజనేయులు, అల్లూరెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పొదిలి, ఫిబ్రవరి 7 : టైలర్స్ కాలనీలో ఉరివేసుకొని అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. టైలర్స్ కాలనీలో ఉంటున్న మాగులూరి రవికుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మరో ఇంట్లో చీరకు ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రవికుమార్ కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. భార్య సలోమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రంగారావు తెలిపారు. రవికుమార్‌కు ముగ్గురు పిల్లలున్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం

కంభం, ఫిబ్రవరి 7 : జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను ప్రతిచోటా గెలిపించుకుంటేనే రాబోయే రోజుల్లో కాపుల కల సాకారమవుతుందని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల కాపు సంఘం నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. బుధవారం ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో 3 మండలాల కాపు సంఘం అధ్యక్షుడు కాసుల పాండు, వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.


బీసీ సదస్సులో మాట్లాడుతున్న బాలాజీ

బీసీలకు సముచిత స్థానం కల్పించింది టీడీపీనే

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలాజీ

తాళ్లూరు, ఫిబ్రవరి 7 : దివంగత ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు పాలన వరకు బీసీ వర్గాలకు పాలనలో, పదవుల్లో సముచిత గౌరవం ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం సమీపాన మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పిన్నిక రమేష్‌బాబు అధ్యక్షతన బుధవారం జరిగిన జయహో బీసీ సదస్సులో నియోజకవర్గ నేత గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలకు ఆదరణ తగ్గిందన్నారు. ముందుగా రజానగరం రోడ్డు నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభాప్రాంగణం వద్ద ఉన్న కలామ్, మదర్‌థెరిస్సా, ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేశారు. సభా వేదికపై పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు కూటాల ప్రసాద్, నేతలు మానం రమేష్‌బాబు, షేక్ కాలేషావలి, షేక్ కాశింసైదా, జి.వేణుబాబు, పాశం సూరిబాబు, వంగపల్లి నాగేశ్వరరావు, బూచిరాజు, సిహెచ్.నాగేశ్వరరావు, రావినూతల పరిశుద్ధరావు, మీరామొహిద్దీన్, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, తూము శివనాగిరెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, కె.రామకోటిరెడ్డి, మాగంటి శ్రీనివాసరావు, జె.పోతురాజు జి.లక్ష్మీనారాయణ, అనపర్తి సుబ్బారావు, కె.రామయ్య ఎఫ్రాయిమ్, రాచకొండ వెంకట్రావు, నుసుం ఆదినారాయణరెడ్డి, పాలెపోగు దాను, కె.నాగార్జునరెడ్డి, షేక్ అన్వర్‌బాష, స్వామిదాసు, జి.నర్సిరెడి పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయకుండా ప్రారంభమా..?

» వెలిగొండ రాజకీయ పార్టీల ప్రతినిధులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 7: అత్యంత ప్రాధాన్యత కలిగిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఎలా ప్రారంభిస్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి అందె నాసరయ్య వైసీపీ పాలకులను ప్రశ్నించారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా ఏర్పాటు కోరుతూ ఆప్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులతో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆప్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, సీపీఎం నాయకుడు సోమయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్వీ సురేష్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీకి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేయడమే కాక పూర్తి చేశామని త్వరలో నే ప్రారంభిస్తాననడం విడ్డూరం అన్నారు. కాంగ్రెస్ నాయకులు రెహానా బేగం, బాలనాగయ్య, రూబెన్, జనసేన కాశీరామ్ సింగ్, శ్రీనివాసులు, కేవీపీఎస్ నాయకులు రాజు పాల్గొన్నారు.

13న శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

త్రిపురాంతకం, ఫిబ్రవరి 7: త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఈనెల 13న ఉదయం 11 గంటలకు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకృష్ణ శివప్రసాద్ తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద జరిగే సమీక్షకు మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తహసీల్దార్ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సూపర్‌వైజర్, సేల్స్‌మన్ అరెస్టు

పీసీపల్లి, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 143 మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సెబ్ సీఐ వీరవల్లి సైమన్ తెలిపిన వివరాల మేరకు... పెదయిర్లపాడు మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందింది. సిబ్బందితో అక్కడకు వెళ్లగా కారు, ద్విచక్రవాహనాలలో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న సాయిక్రిష్ణారెడ్డి, సేల్స్‌మన్ వినోద్‌కుమార్‌లుగా గుర్తించారు. వీరి వద్ద 143(180ఎమ్ఎల్ పరిమాణం గల)మద్యం బాటిళ్లు, కారు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



నేడు డాక్టర్ ఉగ్ర పుట్టినరోజు వేడుకలు

కనిగిరి, ఫిబ్రవరి 7 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 51వ పుట్టినరోజు వేడుకలను స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరగనున్నట్లు డాక్టర్ ఉగ్ర కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

బాల్య వివాహాలను అరికట్టాలి

కనిగిరి, ఫిబ్రవరి 7 : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌బీసీసీ సెల్ సభ్యులు కిరణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని బడుగులేరు గ్రామంలో బుధవారం బాల్య వివాహాలపై జరిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో గుడ్‌హెల్ప్ రమేష్, ఏఎన్ఎం మల్లేశ్వరి, వీఓఏ శైలజ, సోషల్ వర్కర్ సలోమి, అంగన్వాడీ వర్కర్‌లు వెంకటలక్ష్మీ, శారమ్మ పాల్గొన్నారు.

పేదలకు చేరువగా వైద్యం

కనిగిరి, ఫిబ్రవరి 7 : ప్రభుత్వం పేదలకు వైద్యం మరింత చేరువ చేసిందని మున్సిపల్ కమిషనర్ దానియేలు చెప్పారు. స్థానిక 6వ సచివాలయంలో సురక్షా కార్యక్రమం ద్వారా బుధవారం కంటి సంబంధ బాధితులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, డాక్టర్ ప్రియార్శానంద, వైద్యాధికారులు రోహిణిరెడ్డి, నాగరాజు, వార్డు కౌన్సిలర్ దాసరి పద్మ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పామూరు, ఫిబ్రవరి 7 : పొదుపు గ్రూపు మహిళలకు ఆసరా నమూనా చెక్కును నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ పంపిణీ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గ్రౌండ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని 957 గ్రూపులకు 4 కోట్ల 12 లక్షల రూపాయల నమూనా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఇటీవల ఎమ్మెల్యే బుర్రాకు టికెట్ కేటాయించకపోవడంపై కొందరు ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. బుధవారం జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రాజీనామాలు చేసిన వారు హాజరుగావడం గమనార్హం.








● రొయ్యల సాగు
● సూర్యలంక బీచ్
● రేపల్లె వద్ద కాల్వల పరిస్థితి

ప్చ్..నిరాశే



బాపట్ల జిల్లాకు దక్కని ప్రాధాన్యం

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుంది. పలు కార్యాలయాల్లో మౌలిక వసతుల కొరత వెంటాడుతూనే ఉంది. జిల్లా అయితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా కొత్త పుంతలు తొక్కుతుందని ఆశలు పెట్టుకున్న నిరుద్యోగుల ఆశ రెండేళ్లుగా నెరవేరలేదు. జిల్లా ఆవిర్భవించాక గతేడాది ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కుతుందని ఆశపడిని ప్రజలకు నిరాశే మిగలగా, బుధవారం ప్రవేశపెట్టిన మలి బడ్జెట్ సైతం జిల్లావాసులకు నిరాశనే మిగిల్చింది. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు ఇతోధికంగా నిధులు రాబట్టడంలో పాలకపార్టీ నేతల కృషి నామమాత్రంగా కూడా లేకపోవడంతో వారు ఇచ్చిందే దక్కుదల, వచ్చిందే ప్రాప్తం అన్నట్లుగా ప్రజల పరిస్థితి తయారైంది. సమీకృత కలెక్టరేట్ ప్రతిపాదనలను తొలినాళ్లలో రూపొందించారు. గతేడాది బడ్జెట్‌లో అందుకు సంబంధించి నిధులేవీ కేటాయించకపోవడంతో వాటిని అటకెక్కించారు. ప్రస్తుత బడ్జెట్‌లో అయినా వాటి ఊసు ఉంటుందనుకుంటే అదేమీ కనడడలేదు. జిల్లా పారిశ్రామికంగా ఎదగ డానికి అవకాశం ఉన్న రంగం ఆక్వాపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపు తోంది. పర్చూరు ప్రాంతంలో ఎక్కువగా మిర్చి, డెల్టా ప్రాంతంలో వరి రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక కేటాయింపులేవి బడ్జెట్ పద్దులో కనబడలేదు. గుంటూరు ఛానల్ విస్తరణకు రైతు సంఘాలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నా కేటాయింపులో దాని ఊసే కరువైంది. జిల్లాలో కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయిస్తున్నట్లు గత బడ్జెట్‌లో పొందు పరిచారు. అయితే ఇంతవరకు పైసా విదిల్చిన పాపాన పోలేదు. ఈ ఏడాది పద్దులోనూ ఆ పథకానికి నిరాశే ఎదురైంది. దాదాపు 5,000 ఎకరాలకు నీరందించే భవనాసి రిజర్వాయర్ పనులకు సంబంధించి కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు. కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు వదిలినప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరడం గగనమైపోయినా పాలకులు పట్టించుకోలేదని బడ్జెట్‌తో అర్థమవుతుంది. గతంలో కలెక్టర్ విజయకృష్ణన్ పర్యాటకరంగం అభివృద్ధికి బాపట్లలో మంచి స్కోప్ ఉందని గుర్తించి 4 కోట్లతో ప్రతి పాదనలు పంపారు. ఆ కొద్ది మొత్తం విడుదలకు కూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. కనీసం ఈ బడ్జెట్‌లో అయినా ఎంతోకొంత వాటా దక్కుతుందను కుంటే ఇక్కడా నిరాశే ఎదురైంది.


● పునాదుల్లోనే నిలిచిపోయిన బాపట్ల మెడికల్ కళాశాల


అద్దంకి: చిల్లచెట్లతో మధ్యలో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం

ఎన్నికలకు ముందు బడ్జెట్.. నిధులు వరద.. ప్రత్యేక ప్రాజెక్టుల ప్రకటన.. పాత పనులకు ప్రత్యేక కేటాయింపులు.. అని ఆశించిన వారికి బుగ్గన బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రస్తావన లేకుండానే బడ్జెట్ ప్రవేశ పెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఏ ఒక్క ప్రాజెక్టు కు ఎలాంటి కేటాయింపులు జరపలేదు. గంటకు పైగా సాగిన ఆయన సుదీర్ఘ ప్రసంగంలో ఒకే ఒక్క చోట నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని మాత్రం ప్రస్తావించారు. అంతకు మించి ఎక్కడా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పేరు ప్రస్తావనకు రాలేదు.

- బుగ్గన బడ్జెట్‌లో మొండిచెయి
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు నిధులు నై
- బడ్జెట్ కేటాయింపుల్లో దక్కని ప్రాధాన్యం
- కీలక రంగాలకు నిధుల ఊసే లేకుండా బడ్జెట్
- పల్నాడు, బాపట్ల జిల్లాలపై రెండో ఏడూ శీతకన్నే

బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం, నల్లమడ డ్రెయిన్ మోడర్ నైజేషన్, బుగ్గవాగు రిజర్వాయర్, కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడికాలువ ప్రాజెక్టుల పనులకు సంబంధించి నిధుల కేటా యింపు జరపలేదు. బుగ్గన బడ్జెట్‌తో జిల్లా ప్రజానీకానికి ఒరి గేది ఏమి లేదని స్పష్టమైంది. ప్రధానంగా భారీ నీటిపారుదల శాఖకు సంబంధించి కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణకు సంబంధించి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే టెండర్లు జరిగాయి. ఈ ఐదేళ్లలో భూసేకరణ ప్రక్రియ నోటిఫికేషన్ల వరకు మాత్రమే వైసీపీ తీసుకొచ్చిందంటే నీటిపారుదల రంగంపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లం అవుతున్నది. పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం పనులను వైసీపీ ప్రభుత్వం వస్తూనే నిలిపేసింది. వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం అంటూ పేరు మార్చి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిధులు కేటాయిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చింది. తీరా చేతులెత్తేయడంతో నిర్మాణ సంస్థలు కూడా వెనకడుగు వేసి యంత్రపరికరా లన్నింటిని వేరే ప్రాంతానికి తరలించాయి. నాగార్జున సాగర్, కృష్ణా పశ్చిమ డెల్టా కాలు వలపై ఈ ఐదేళ్ల లో నామమాత్రంగానే పనులు జరిగాయి. టీడీపీ హయాంలో అమరావతి నూతన రాజధాని నిర్మాణానికి ఏటా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపేది. వైసీపీ ప్రభుత్వం అమరావతి అనే పదాన్ని తొలగించి నూతన రాజధాని అని పెట్టి కేటాయింపులు జరిపినా ఇక్కడ ఎలాంటి నిధులు ఖర్చు పెట్టలేదు. బాపట్ల, గురజాల నియోజకవర్గాల్లో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కాలేజీల పనులు ముందుకు సాగాలంటే ఈ బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు జరగాల్సి ఉన్నది. అమరావతి - అనంతపురం గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుని కూడా బుట్ట దాఖలు చేసింది.


గుంటూరు ఛానల్



పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల


నిజాంపట్నం హార్బర్


గోదావరి జలాల తరలింపు పథకంకు నకరికల్లు వద్ద నాటి సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

చిత్తశుద్ధి కరువు

పల్నాడు జిల్లాలోని నీటి పథకాలపై ప్రభుత్వం మొండిచెయి చూపింది. నీటి పథకాలను పూర్తి చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బుగ్గన బడ్జెట్ తెలియజేసింది. పల్నాడు జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుండగా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు లేవు. దీంతో తొలి బడ్జెట్‌లాగే ఈ ఏడూ జిల్లా వాసులకు నిరాశనే మిగిల్చింది. తాగు, సాగునీటి పథకాలకు నిధుల కేటాయింపులు లేదు. వాటర్ గ్రిడ్‌పై, దశాబ్దాల కలైన వరికపూడిశెలకు బడ్జెట్‌లో నిధులు లేవు. పల్నాడు కరువు పథకం పనుల ఊసే ఎత్తలేదు. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం గురించి ఆలోచించలేదు. గోదావరి పెన్నా నధుల అనుసంధానంలో భాగంగా వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ పథకంగా పేరు మార్చిన ప్ర భుత్వం నిధుల విడుదలను విస్మరించింది. వరికపూడిశెల ప్రాజెక్టు విష యంలోనూ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నదని ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతుందని రైతులు మండిపడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా సీఎం శంకుస్థాపన చేసి నిధులు విడుదల చేయకుండా చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు రాకుండానే శంకుస్థాపన చేయడం ప్రజలను మోసం చేయడమేనని చెప్పవచ్చు. దాదాపు 21,473 ఎకరాలను సాగు నీరు అందించే తంగెడ, మాచవరం ఎత్తిపోతల పథకాలు సర్వే దశలో ఉన్నా బడ్జెట్‌లో నిధుల కేటాయింపును విస్మరించింది. ఇప్పట్లో ఈ పథకాల పనులు పట్టాలెక్కే పరిస్థితులు కానరావడంలేదు. జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రకటించిన వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం విస్మరించిందన్న విమర్శలున్నాయి. రూ.1200 వ్యయం అవుతుందని అంచనా వేసి, 611 గ్రామాలకు నీరు అందించే ఈ బృహత్తర పథకం నిర్మాణంపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. నిధులు లేకపోవడంతో రెండేళ్లుగా ఈ పథకం పను లు ప్రారంభం కాలేదు. ఈ బడ్జెట్‌లోనూ నిధులను విస్మరిం చడంతో ఈ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. తాగు, సాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాల్వ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు నిధుల విడుదల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుందన్న విమర్శలున్నాయి. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే గురజాల, మాచర్ల నియోజకవర్గాల ప్రజలకు వేసవిలో తాగునీటి కష్టాలు తప్పే అవకాశం ఉన్నా ప్రభుత్వంలో చలనంలేదు. జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై అధారపడి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై జిల్లావాసులు తీవ్ర అసం తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన సాగు, తాగునీటి పథకాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవ డిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. .


ఎత్తిపోతల

ఓదారుస్తూ.. భరోసా

నిజం గెలవాలి యాత్రలో భువనేశ్వరి

- బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం
- టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఘనస్వాగతం


వట్టిచెరుకూరు : అనంతవర్పాడు ఎస్సీ కాలనీలో కోటేశ్వరరావు భార్యకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

వట్టిచెరుకూరు, నరసరావుపేట రూరల్, రొంపిచర్ల, యడ్లపాడు, ఫిబ్రవరి 7: ఓదారుస్తూ.. పరామర్శిస్తూ.. యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ.. ధైర్యంగా ఉండాలి.. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ.. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర చేపట్టారు. బుధవారం పల్నాడు, గుంటూరు జిల్లాలో ఆమె పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో కలత చెంది గతంలో మృతి చెందిన కుటుంబాలను ఈ పర్యటనలో భువనేశ్వరి ప్రత్యేకంగా పరామర్శించారు. ఆయా కుటుంబాల వారికి ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో నార్నె విజయలక్ష్మి, అనంతవరప్పాడు ఎస్సీకాలనీలో కోటేశ్వరరావు, యడ్లపాడు ఎస్టీకాలనీలో మరణించిన మొగిలి సత్యనారాయణ కుటుంబాల్ని పరామర్శించారు. అనంతరం నరసరావుపేట మండలం ములకలూరులోని షేక్ సైదా, పాలపాడులోని కొలికొండ ఆంజనేయులు, రొంపిచర్ల మండలం అన్నవరంలో ఉదయ్‌శేఖర్, చిన్న భిక్షాలు కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కులు అందజేశారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు.

పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వాగతం

భువనేశ్వరి పర్యటనలో టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు హారతు లు పట్టి ఆమెకు స్వాగతం పలికారు. యడ్లపాడు, చిలకలూరిపేట, కావూరు, అవిశాయపాలెం, ములకలూరు, నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు, కాకతీయనగర్, రావిపాడు, పాలపాడులలో మహిళలు, టీడీపీ శ్రేణులు భువనేశ్వరికి స్వాగతం పలికారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి ప్రత్తి పాటి పుల్లారావు, ప్రత్తిపాటి వెంకటకుమారి, నరసరావుపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ నేతృత్వంలో భువనేశ్వరికి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ అనురాధ, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ములకలూరులో చెక్కును అందజేసి కుటుంబ సభ్యులతో భువనేశ్వరి


నరసరావుపేట: పాలపాడులో చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

● వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు, వింజనంపాడు గ్రామాల్లో భువనేశ్వరికి అడుగడుగున మహిళలు టీడీపీ, జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్ర హాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ప్రత్తిపాడు సమన్వ యకర్త రామాంజనేయులు, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ జడ్పీటీసీ అన్నాబత్తుని జయలక్ష్మి, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, అనంతవరప్పాడు గ్రామ అధ్యక్షుడు మోపర్తి శంకర్, సర్పంచ్ దారా వెంకట్రావు, జనసేన మండల అధ్యక్షులు పత్తి భావన్నారాయణ, కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాగిశెట్టి నాగరాజు, జనసేన సమన్వయకర్త క్రొప్పాటి నాగేశ్వరరావు, ప్రవీణ్, మాజీ సర్పంచ్ ముప్పా మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు యర్రగుంట్ల నరేంద్రబాబు, వింజనంపాడు సర్పంచ్ నార్నె రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పటూరి సుజాత, మాజీ సర్పంచ్ చింపిరయ్య, మాజీ ఎంపీటీసీ నార్నె సాంబశివరావు, పరిటాల హరిబాబు పాల్గొన్నారు.

నేతలకు ఇసుకపైనే ప్రేమ

- కట్టలను కూల్చేసి అక్రమార్జన
- వైఎస్ చేసిన అభివృద్ధి తప్ప ఇంకేమీ లేదు
- రాజశేఖరరెడ్డి విగ్రహం పెట్టడాన్ని అడ్డుకున్న నేత
- బాపట్ల బహిరంగ సభలో పీసీసీ సారథి షర్మిల

బాపట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నేను దారిలో వస్తుండగా ఓ అన్నను బాపట్ల ఎలా ఉంది అడిగా.. మీ నాన్న ఉన్నప్పుడు 1400 కోట్లతో చేసిన పనులు తప్ప మరేమీ లేద న్నారు. కనీసం రోడ్లు కూడా వేయలేదన్నాడు. ఇక్కడున్న ఎమ్మెల్యే, ఎంపీలకు ఇసుక మాఫియా మీద ప్రేమ తప్ప మరేం లేదు. కట్టలు కట్టడం కాదు కదా వాటిని కూడా కూల్చేసి ఆ ఇసుకను కూడా అక్రమార్జనకు వాడుకుంటున్నారు. రాజశేఖరరెడ్డి విగ్రహం కూడా పెట్టకుండా ఇక్కడున్న వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. వీళ్లా ఆయన ఆశయాలను నెరవేర్చేది.' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి అన్నారు. బుధవారం బాపట్లలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తయితే రెండు పంటలకు నీళ్లు అందుతాయని తెలిసీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాజశేఖ రరెడ్డి వ్యవసాయాన్ని పండగ చేస్తే పంట నష్ట పరిహారం కూడా ఇవ్వని ప్రభుత్వం జగన్‌దని షర్మిల అన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కనీసం బాపట్ల తాగునీటి సమస్యను కూడా పట్టించుకో లేదన్నారు. ఒక్క సీటు కూడా గెలవని బీజేపీకి రాష్ట్రంలోని రెండు పార్టీలు గులాంగిరి చేస్తున్నాయన్నారు. దళిత క్రైస్తవులకు దళితుల హోదా దక్కాలంటే పీసీసీ సారథి షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. గతంలో రామానాయుడు మీద పోటీ చేసి కొద్ది తేడాతో ఓడిపోయానని కాంగ్రెస్ మళ్లీ ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాజశేఖరరెడ్డి దిష్టిబొమ్మలు తగలబెట్టిన వ్యక్తిని వైసీపీలోకి తీసుకుని పదవులు కట్టబెట్టారని స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు తెలిపారు.


మాట్లాడుతున్న షర్మిల

రోడ్ షో విజయవంతం..

బాపట్ల చీలురోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు జరిగిన షర్మిల రోడ్‌షోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాయి. రోడ్డు పొడ వునా ఉన్న జనానికి అభివాదం చేస్తూ షర్మిల ముందుకు కదిలారు. బహి రంగ సభ అనంతరం ఆమె రాత్రి బస కోసం బాపట్ల ఇంజనీరింగ్ కళాశా లకు వెళ్లారు. బుధవారం రాత్రికి అక్కడే బస చేయనున్న ఆమె గురువారం తెనాలి మండలంలో జరిగే రచ్చబండ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కెవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, కనుమూరి బాపిరాజు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు


సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

జై శ్రీరామ్

- గుంటూరు నుంచి అయోధ్యకు రైలు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని భవ్యమైన రామ మందిరం- దివ్యమైన బాలరాముని దర్శనార్థం రామ భక్తులతో కూడిన అయోధ్య ప్రత్యేక రైలు గుంటూరు నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా గుంటూరు రైల్వేస్టేషన్ ప్రాంగణం జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది. రామ భక్తులతో స్టేషన్ కిక్కిరిపోసింది. శ్రీరామభక్తులకు నుదుటిన తిలకం అద్ది బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ పలు బోగీలలోకి వెళ్లి ప్రయాణికులతో మాట్లాడారు. క్షేమంగా అయోధ్యదాం పర్యటన ముగించుకుని రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ప్రత్యేక రైలు లోకోకి పూజలు చేసి వారు పోశారు. ఆ తర్వాత పురందేశ్వరి పచ్చ జెండా ఊపి రైలుకు సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఏపీ నుంచి అయోధ్యకు వెళుతున్న మొదటి రైలన్నారు. భక్తులు తండోపతండాలుగా బాలరాముని దర్శనం కోసం వెళుతుంటే చూడాలని మాత్రమే తాను వచ్చానన్నారు. కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు పాల్గొన్నారు.


రైలుకి జెండా ఊపి ప్రారంభిస్తున్న పురంధేశ్వరి

యువకుడి హత్య కేసులో వీడని మిస్టరీ
● పోలీసులపై పరస్పర ఆరోపణలు

7లో..

జిల్లా విద్యాశాఖాధికారిగా సుభద్ర

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 7 : జిల్లా విద్యాశాఖాధికారిగా డి.సుభద్రను నియమిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. కాకినాడలో ఉప విద్యాధికారిగా పనిచేస్తున్న సుభద్రను ఉద్యోగోన్నతిపై ఇక్కడ డీఈవోగా నియమించారు. ఇక్కడ డీఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న గుంటూరు పాఠశాల ఆర్జేడీ వీఎస్.సుబ్బారావును పాఠశాల విద్యా కమిషనరేట్‌లో టెట్ జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాల విద్యా గుంటూరు ఆర్‌జేడీగా విజయనగరం డీఈఓగా పనిచేస్తున్న బి.లింగేశ్వరరెడ్డిని ఉద్యోగోన్నతిపై నియమించారు.

పోస్టుల భర్తీ ఇక రాష్ట్రస్థాయిలో..

మౌఖిక ఆదేశాలు ఇచ్చిన వైద్యశాఖ

ఉద్యోగ నియామకాల్లో అవకతవకలను నిరోధించేందుకే అంటున్న వర్గాలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7 : వైద్యశాఖలో పోస్టుల భర్తీ ప్రక్రియ ఇక నుంచి రాష్ట్ర స్థాయి నుంచి చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల వైద్యశాఖ ఉన్నతాధికారులు ఆ మేరకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. జిల్లాస్థాయిలో స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, రేడియాలజిస్టుతోపాటు వివిధ రకాల పోస్టులన్నింటిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జిల్లా స్థాయిలో నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తారు. ప్రతి ఏటా ఇలా రెండు, మూడు సార్లు ఆయా పోస్టుల ఖాళీలకు అనుగుణంగా భర్తీ చేస్తుంటారు. అయితే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యారోగ్యశాఖలో ఇష్టారీతిన నియామకాలు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వైద్యాధికారుల పోస్టులను రాష్ట్ర స్థాయిలోనే నోటిఫికేషన్ ఇస్తూ భర్తీ చేస్తుంటారు. ఆ విధంగానే జిల్లాస్థాయిలో భర్తీ చేసే పోస్టులను కూడా రాష్ట్రస్థాయి నుంచి భర్తీ చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై చర్చ కూడా జరిగినట్లు సమాచారం. రాష్ట్రస్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసి జిల్లాస్థాయిలో భర్తీ చేయాల్సిన పోస్టుల నియామకం ఎలా చేపట్టాలి, నోటిఫికేషన్ జిల్లాస్థాయిలో ఇవ్వాలా లేక రాష్ట్రస్థాయిలో ఇస్తే సరిపోతుందా అన్న దానిపై కూడా కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల వైద్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లాల వైద్యాధికారులతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఈ విషయాన్ని మౌఖికంగా చెప్పినట్లు తెలిసింది. జిల్లాల్లో పోస్టుల భర్తీపై కూడా దిశానిర్దేశం కూడా చేసినట్లు తెలిసింది. ఈ విధానం వల్ల జిల్లాస్థాయిలో భర్తీ చేయాల్సిన పోస్టులను రాష్ట్రస్థాయిలో భర్తీ చేయడం ద్వారా అభ్యర్థులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే పరిస్థితి కూడా కనిపిస్తోంది. అయితే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏ విధమైన నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

ఆశా వర్కర్లపై ఆంక్షలు

120 మందికి నోటీసులు.. సీఐటీయూ నేతలపై నిఘా

బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో పోలీసు పికెట్లు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి07: ఆశా వర్కర్ల ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నేడు చలో విజయవాడ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సీఐటీయూ అందుకు మద్దతు తెలిపింది. దీంతో జిల్లా నుంచి ఆశా వర్కర్లు ఎవరు ఆ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఎస్పీ మలికగర్గ్ పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీంతో ఇప్పటికే జిల్లాలో ముఖ్యమైన ఆశావర్కర్లు 120 మందిని గుర్తించి వారికి నోటీసులు జారీచేశారు. అంతేకాకుండా సీఐటీయూ నాయకులకు సైతం ముందస్తు నోటీసులు అందజేశారు పోలీసులు. అదేక్రమంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా విజయవాడ వైపు వెళ్లే రహదారులపై వాహన తనిఖీలు చేపట్టారు. ఆశా వర్కర్ల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. రైళ్లల్లో ఇతర జిల్లాల నుంచి వచ్చేవారిని సైతం గుర్తించి వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సూపర్‌వైజర్, సేల్స్‌మన్ అరెస్టు

పీసీపల్లి, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 143 మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సెబ్ సీఐ వీరవల్లి సైమన్ తెలిపిన వివరాల మేరకు... పెదయిర్లపాడు మద్యం దుకాణం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందింది. సిబ్బందితో అక్కడకు వెళ్లగా కారు, ద్విచక్రవాహనాలలో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సాయిక్రిష్ణారెడ్డి, సేల్స్‌మన్ వినోద్‌కుమార్‌లుగా గుర్తించారు. వీరి వద్ద 143(180ఎంఎల్ పరిమాణం గల) మద్యం బాటిళ్లు, కారు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైసీపీని వీడి టీడీపీలోకి

వ్యాపారులకు సహకారం అందిస్తా : మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైసీపీని వీడిన 140 కుటుంబాలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 7 : వ్యాపారాలు చేసుకునే ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మెయిన్‌బజారులో ఆర్యవైశ్య నాయకులు వాడకట్టు శివప్రసాద్ ఆధ్వర్యం లో 40 ఆర్యవైశ్య కుటుంబాలవారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో వ్యాపారులు అన్ని విధాలుగా నష్టపోయారని, జగన్‌రెడ్డి నిరంకుశ విధానాలతో వాణిజ్యరంగాలపై చేసిన దాడులు దారుణమన్నారు. వాడకట్టు శివప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపు కోసం తామంతా కృషి చేస్తామన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో ఆర్యవైశ్య నాయకులు జిలకర సత్యనారాయణ, వాడకట్టు యోగేశ్వరరావు, దమ్మాల మధు, శివపురం వెంకటేశ్వర్లు, వాడకట్టు చిన్నసత్యనారాయణ, రాచపాటి నరసింహారావు, వాడకట్టు సాయి, నటుకుల సాయి, నటుకుల శ్రీను, నటుకుల నాగరాజు, శివపురం వెంకటరామయ్య, గోపాల్, శేగు కిరణ్, సూరె నాగేశ్వరరావు, శింగరి రంగస్వామి, తుమ్మలపెంట మోహన్, ఎం.శ్రీనివాసులు, కె. రామక్రిష్ణ, ఎం.సత్యనారాయణ, తుమ్మలపెంట సత్యనారాయణ పాల్గొన్నారు. 18వ వార్డులో బాబుషూరిటి భవిష్యత్‌కు గ్యారెంటీ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వార్డుకు చెందిన సాదనబోయిన శ్రీనివాసులు, ఎస్.హసేన్‌బాషా, ఎం.రంగనాయకులు, బొంతా రంగస్వామి, ఎం.శోభన్‌బాబు, బికేశాలు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. జడ్పీ టీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మాజీ సర్పంచ్ దప్పిలి విజయబాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

100 కుటుంబాలు చేరిక

త్రిపురాంతకం : మండలంలోని గణపవరం, రాజుపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. గణపవరంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తుల లక్ష్మయ్య, నాయకులు గుంటక మహేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, అలవాల పెద్దనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గుంటక వెంకటేశ్వరరెడ్డి (కర్ణమయ్య), మాజీ సర్పంచ్ నక్కా రోశయ్య, ఉప్పుతోళ్ల ఏసుబాబు, మాచర్ల దావీదు, వజ్రాల తిరుపతమ్మలతోపాటు సుమారు 100 కుటుంబాలు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరాయి. రాజుపాలెంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కందుల రమణారెడ్డి, మానికొండ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చల్లా వెంకటయ్య, తిరుపతి గురవయ్య, వెంకటరమణ, వీరయ్య, బండారు కొండలు, ఓర్సు బాబులతోపాటు సుమారు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చే రాయి. కొత్తగా పార్టీలో చేరిన వారికి టీడీపీ ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, వీ ఆంజనేయులు, అల్లూరిరెడ్డి పాల్గొన్నారు.



రాజుపాలెంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

అవినీతి డొంక కదులుతోంది..!

మెప్మాలో మోసం జరిగిన మాట వాస్తవమే : మేయర్

వైసీపీ వాళ్లను కాపాడి, అధికారులను బాధ్యులను చేసే ప్రయత్నం

ఆర్పీలు, సీఓలతో అధికారుల సమావేశం

బోగస్ గ్రూపులు, బ్యాంకులకు బురిడీపై బాలినేని సీరియస్

ఆంధ్రజ్యోతి కథనంతో అక్రమార్కుల్లో ఉలికిపాటు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7 : ఎట్టకేలకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మాలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలపై అధికారులు కదిలారు. కోట్లు దండుకున్న ఆర్పీలు, అధికారపార్టీ నేతల రుణ దోపిడీ గుట్టును రట్టు చేసేందుకు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈనెల 5వతేదీన ఆంధ్రజ్యోతిలో ప్రధాన శీర్షికన ప్రచురించిన 'మెప్మాలో మెక్కేశారు' ఆ తర్వాత రోజున ప్రచురించిన 'మెప్మాలో కలకలం' కథనాలతో అవినీతి డొంక కదులుతోంది. మెప్మా అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఇదిలాఉండగా, మేయర్ గంగాడ సుజాత అక్రమాలు నిజమేనని ఒప్పుకుంటూనే వైసీపీ నేతలను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. రూ.50 కోట్లు అవినీతి జరగలేదని, రూ.12కోట్లు మాత్రమే అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని వెల్లడించారు. అయితే ఆంధ్రజ్యోతి ప్రచురించిన విధంగా వైసీపీ నాయకుల భాగస్వామ్యం, అధికారుల నిర్లక్ష్యం, రుణాల మంజూరులో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సీరియస్ అయ్యారు. అందిన సమాచారం మేరకు బాలినేని కలెక్టర్, మెప్మా పీడీ, సీఎంఎం కొండయ్యలతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. దీనిపై విచారణ వేగవంతం చేయాలని ఆదేశించడంతో అధికారులు ఆర్పీలు, సీఓలతో పీడీ సమావేశం ఏర్పాటు చేయగా, మేయర్ సుజాత అసలు వాస్తవాలను దాచిపెట్టి అధికారులు, బ్యాంకర్లపై నిందలు వేసి అధికారపార్టీ అక్రమార్కులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

వారికి అండదండలు.. వీరిపైనే నిందలు

మెప్మాలో జరిగిన అవినీతి బాగోతంలో భాగస్వాములైన వారు అధిక శాతం మంది అధికార పార్టీ వైసీపీకి చెందిన వారే ఉన్నట్లు ఆధారాలు వెలుగుచూస్తున్నాయి. అయితే నష్టనివారణ చర్యల్లో భాగంగా మేయర్ తమ పార్టీ వారిని సమర్థించుకుంటూ, టీడీపీకి చెందిన ఆర్పీలు ఉన్నట్లుగా వెల్లడించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇందులో కీలకంగా వ్యవహరించిన కొందరు ఆర్పీల పేర్లు మాత్రమే వెల్లడించిన మేయర్ మెప్మాకి సంబంధం లేకుండా బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొందిన అధికార పార్టీ మహిళా నాయకులు, ఇతర నాయకుల పేర్లు కప్పిపుచ్చడం వెనుక అవినీతిలో సూత్రధారులకు వైసీపీ అండదండల బాగానే ఉన్నాయని స్పష్టం అవుతుంది. తన మీడియా సమావేశంలో వారి పేర్లు మాత్రం వెల్లడించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసి, ప్రకంపనలు సృష్టించిన మెప్మా స్కాంలో వైసీపీ వారి హస్తం వెలుగుచూడటంతో అబ్బే మాకేం తెలియదు.. అంతా వారే చేశారంటూ అధికారులను బలి చేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. తమ పార్టీ వారిని కాపాడుకుని, మెప్మా అధికారులను బాధ్యులను చేసి, తాము చేసిన అవినీతి మరకలను తొలగించుకోవడం కోసం ఇక్కడి నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లుగా స్పష్టమవుతుంది. ఈ వ్యవహారంలో కొందరు సీఓలు, సీఎంఎం, పీడీలతోపాటు ఇతర ఉద్యోగులను బాధ్యులను చేయడానికి వైసీపీ నేతలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

బ్యాంకులను బురిడీ కొట్టించి, బోగస్ గ్రూపులను సృష్టించి కోట్లు దండుకున్న ఆర్పీలు, వైసీపీ మహిళా నేతల అవినీతి డొంక కదులుతోంది. వాస్తవాలను తేల్చేందుకు మెప్మా అధికారులు బుధవారం ఆర్పీలు, సీఓలతో అత్యవసర సమావేశం పెట్టారు. బోగస్ గ్రూపులపై విచారణ చేయడంతోపాటు రుణాలు ఎవరు తీసుకున్నారు. ఎప్పుడు తీసుకున్నారు. ఎంత తీసుకున్నారు అనే అంశాలపై విచారణ వేగవంతం చేశారు. ఇదేసమయంలో మేయర్ గంగాడ సుజాత తన చాంబర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, నకిలీ పొదుపు గ్రూపులతో రుణాలు తీసుకుని అవినీతికి పాల్పడిన మాట వాస్తవమేనని అంగీకరించారు. కాకుంటే తెలివిగా అధికారులు, బ్యాంకర్లను బాధ్యులను చేస్తూ వైసీపీ నేతలను కాపాడే ప్రయత్నం చేయడం గమనార్హం.

ఎమ్మెల్యే బాలినేని సీరియస్

మెప్మాలో అవినీతి వ్యవహారం బయటపడటంతో మేయర్ సుజాత మంగళవారం హుటాహుటిన విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఆయనను కలిసి, ఇక్కడి జరిగిన అవినీతి, పత్రికలో వచ్చిన కథనాన్ని చూపించి ఏం చేయాలనే విషయాలపై చర్చించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన బాలినేని కలెక్టర్ దినేష్‌కుమార్, పీడీ రవికుమార్‌తోపాటు, సీఎంఎం కొండయ్యతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై విచారణ చేయాలని కలెక్టర్‌ను కోరడంతో పాటు మెప్మా అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అసలు మెప్మాలో ఏం జరుగుతుంది. ఇంత పెద్దమొత్తంలో అవినీతి జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు మండిపడ్డారు.



అవినీతిపై వివరాలు వెల్లడిస్తున్న మేయర్

నకిలీ గ్రూపుల పేరుతో అవినీతి వాస్తవమే: మేయర్

ఒంగోలు నగరపాలక సంస్థలో భాగస్వామ్యమైన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో అవినీతి వాస్తవమేనని ప్రాథమికంగా గుర్తించినట్లు మేయర్ గంగాడ సుజాత తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పత్రికలో రాసిన విధంగా రూ.50కోట్లు అవినీతి జరగలేదన్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు రూ.12కోట్లు వరకు అవినీతి జరిగి ఉండవచ్చని సమాధానం మిచ్చారు, అదీ కూడా పొదుపు రుణాలు కాకుండా మరో పేరుతో గ్రూపుల ద్వారా రుణాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. 2022లో రుణాలు తీసుకున్న కొందరు ఆర్పీలు తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకర్లు దీనిపై మెప్మా అధికారులకు సమాచారం కూడా ఇచ్చారన్నారు. అయితే ఈ అవినీతి వ్యవహారంలో కేవలం వైసీపీకి చెందిన ఆర్పీలు, నాయకులే కాకుండా టీడీపీకి చెందిన ఆర్పీలు కూడా భాగస్వాములై ఉన్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. అయితే టీడీపీ నాయకులు అయిన దానికి, కాని దానికి, సంబంధం లేని వాటికి కూడా బాలినేని పాత్ర ఉందని మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో భూకుంభకోణంపై సిట్ వేయించింది బాలినేని అని, అలాగే ఇప్పుడు మెప్మాలో అవినీతిపై అవసరమైతే సిట్‌తో విచారణ చేయించాలని కలెక్టర్‌ను కోరారు.

ఎన్నికల పద్దు

బుగ్గన బడ్జెట్‌పై పెదవి విరుపు

వెలిగొండ, దొనకొండ కారిడార్‌కు అరకొరే

మిగతా కీలక ప్రాజెక్టుల ప్రస్తావన కరువు

జిల్లా అంశాలకు కనిపించని ప్రాధాన్యత

ఒంగోలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీ లో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఆయా రంగాల్లోని పథకాలు, ప్రాజెక్టులకు స్పష్టమైన కేటాయింపులు చేసే అవకాశం లేకపోగా మూడు మాసాల పాటు ప్రభుత్వ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఎన్నికల సమయంలో ప్రవేశపెడతారు. అయితే వార్షిక బడ్జెట్ పేరుతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.86 లక్షల కోట్లతో భారీగా ప్రవేశపెట్టారు. అయితే ఏ ఒక్క అంశానికి ప్రత్యేక కేటాయింపులు చూపకుండా ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో చేసిన సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు వాటి వల్ల ప్రజలు భారీగా అభివృద్ధి చెందారంటూ బుగ్గన బడ్జెట్ ప్రసంగంలో మాట్లాడటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల ప్రచార సభల్లో చేసే ప్రసంగంలా బడ్జెట్ ప్రతిపాదిత ప్రసంగం ఉందన్న అభిప్రాయం వివిధ వర్గాల్లో వ్యక్తమవుతుంది. ఇదిలా ఉండగా ఆయా ప్రధాన రంగాలలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన కీలక అంశాలు, ప్రాజెక్టులు, ప్రత్యేక పథకాలను బడ్జెట్ ప్రసంగంలో బుగ్గన ప్రస్తావించగా అందులో జిల్లాకు చెందిన వాటికి ఎక్కడ ప్రాధాన్యత కనిపించలేదు. అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు నిర్వాసితుల తరలింపు జాప్యం నిధుల కొరత ప్రతిబంధకంగా ఉంది. దాదాపు రూ.6వేల కోట్లు ఇప్పటివరకు ఖర్చు కాగా మరో రూ 3వేల కోట్లు అవసరం. అయితే అంతటి కీలక ప్రాజెక్టు వేగంగా జరుగుతుందని పేర్కొన్నారే తప్ప ప్రత్యేక ప్రస్తావన, నిధులు కేటాయింపు కనిపించ లేదు. అలాగే దొనకొండ కారిడార్, ఆంధ్రకేసరి వర్సిటీ, నిమ్జ్, ట్రిబుల్ ఐటీ, వాటర్ గ్రిడ్, టిడ్కో ఇళ్లు, ఫిషింగ్ హార్బర్, ఇతరత్రా పలు అంశాల ప్రస్తావన కూడా నామమాత్రంగానే ఉంది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్ కేటాయింపులు అవకాశం లేకపోయినా కనీసం జిల్లాకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వ దూరదృష్టి కూడా అందులో ఎక్కడ కనిపించలేదన్న విమర్శలు విభిన్న వర్గాల్లో వ్యక్తమవుతోంది.



అసెంబ్లీలో బడ్జెట్‌పై ప్రసంగిస్తున్న మంత్రి బుగ్గన

అబద్ధాలు.. తప్పుడు లెక్కలు

- డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కొండపి ఎమ్మెల్యే



బుగ్గన బడ్జెట్ ఎన్నికల ప్రచార కరపత్రంలా ఉంది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఏదో చేసిందన్న గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేశారు. సంక్షేమం పేరుతో మోసం చేశారు, అభివృద్ధిని అటకెక్కించిందని ప్రజలందరూ గుర్తించగా వాటిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. తప్పుడు లెక్కలు అబద్ధపు ప్రచారాలు అధికంగా ఉన్నాయి. కాగ్ రిపోర్టుకు, బడ్జెట్‌లో లెక్కలకు ఉన్న వ్యత్యాసాలే అందుకు నిదర్శనం.

ఎన్నికల ప్రచారంగా బడ్జెట్


- ఎంఎల్ నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి



అన్ని తప్పుడు లెక్కలు, గణాంకాలే తప్ప నమ్మదగ్గగా ఏమి లేవు. బుగ్గన బడ్జెట్‌లో జీడీపీలో మన పరిస్థితి 16వ స్థానంలో ఉన్నా దానిని తప్పుగా చెప్పారు. అప్పుల ఊబిలో రాష్ట్రం కూరకపోయింది. వెలిగొండ, దొనకొండ పారిశ్రామిక కారిడార్ ప్రస్తావన కూడా లేదు. జిల్లాకు తీవ్ర అన్యాయం.

వెలిగొండ ప్రాజెక్టుకు మొండిచేయి

- జీవీ కొండారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు



బుగ్గన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్‌లో వెలిగొండకు మొండిచేయి చూపారు. పారిశ్రామిక అభివృద్ధికి కేటాయింపులు లేవు. జిల్లా అభివృద్ధిని విస్మరించారు. వెలిగొండ నిర్వాసితుల ప్యాకేజీ ప్రాస్తావన లేదు. టిడ్కో ఇళ్ళు, ఏకే వర్సిటీకి నిధులు వంటివి ఏమి లేవు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రాంత ప్రజలకు బ్లాక్ డే

-శిరసనగండ్ల శ్రీనివాసులు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు



పశ్చిమ ప్రాంత ప్రజలకు బ్లాక్‌డే. వెలిగొండ నిధుల కేటాయింపు బడ్జెట్‌లో ప్రస్తావన కూడా లేకపోయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని ఇస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఆ తర్వాత విస్మరించారు.

మూడో రోజూ కొనసాగిన పెన్షనర్ల రిలే దీక్షలు



కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీఆర్పీఏ గౌరవ సలహాదారు మీగడ వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం ఏపీఆర్పీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు మూడో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పెన్షనర్లు, ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రయోజనాలను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రధాన కార్యదర్శి సీహెచ్.రాంబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వాలని, అలాగే పీఆర్సీ డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఐఆర్ ప్రకటిస్తూ నూతన పీఆర్సీ బకాయిలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీవీఆర్.సుబ్బారావు, వి.మాలకొండారెడ్డి, కె.కృష్ణమూర్తి, జీవీ.కొండారెడ్డి, పి.పేరయ్య, ఏవీ.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులతోనే స్థానిక సంస్థలు బలోపేతం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7 : రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారానే గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఆర్థికంగా బలబడతాయని ఐదవ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్‌పర్సన్, ప్రొఫెసర్ రత్నకుమారి పేర్కొన్నారు. ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో బుధవారం జరిగిన ఐదవ రాష్ట్ర ఆర్థిక సంఘానికి నూతనంగా ఏర్పడిన చైర్‌పర్సన్, కమిటి సభ్యులు సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. కమిటీ సెక్రటరీ కేవీ రమణారెడ్డి, సభ్యులు కె.కృపారావు, ప్రసాదరావు, పద్మారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లాలో ఆర్థిక వనరుల లభ్యత, వాటి వ్యయాలు, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. అనంతరం చైర్‌పర్సన్‌గా తొలిసారిగా జిల్లాకు వచ్చిన రత్నకుమారిని, సభ్యులను ఘనంగా సత్కరించారు. డీపీవో జీవీనారాయణరెడ్డి, జడ్పీ సీఈవో జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలను చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి



అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం-1988 కింద సంబంధిత సంస్థల యజమానులు విధిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ కె.కనకదుర్గాభవానీ సూచించారు. బుధవారం ఒంగోలులో మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. సంస్థలు రిజస్ట్రేషన్ చేయించుకొని లైసెన్సులు పొందాలని సూచించారు. ఆయా సంస్థల యజమానులు ఆన్‌లైన్ ద్వారా లేదా సమీపంలో సచివాలయాలు, మీసేవకేంద్రాల ద్వారా ఈనెల 29వతేదీలోపు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సహాయ కార్మిక అధికారులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.ఎలిజబెత్తమ్మ, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు జి.వెంకారెడ్డి, వేమూరి సుబ్బారావు, వి.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 7: మార్చి 1నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు తాత్కాల్ పథకం పొడిగిస్తూ ఇంటర్ విద్యా కార్యదర్శి సౌరబ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.3వేల అపరాధ రుసుంతో ఈనెల 10వ తేదీ వరకు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేటు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలోత్సవ్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పాటిబండ్ల ఆనందరావు

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 7: తొలిసారిగా నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో కళకారులు, విద్యార్థులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని బాలోత్సవ్ నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షులు, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు కోరారు. బుధవారం స్థానిక ఎల్బీజీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీలలో స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే బాలోత్సవ్‌లో 50 రకాల అకడమిక్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ కన్వీనర్ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు మనోవికాసానికి ఇటువంటి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రోటరీ క్లబ్ సెంట్రల్ నాయకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒంగోలులో ఈ విధమైన కార్యక్రమం నిర్వహించటం ఎంతో అభినందనీయమని అన్నారు. విలేకరుల సమావేశంలో కొమ్మోజి శ్రీనివాస రావు, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, కె.సుబ్రహ్మణ్యాచారి, వి.బాలకోటయ్య, దామా శ్రీనివాసులు, సి.హెచ్.వినోద్, కె.ఎఫ్.బాబు పాల్గొన్నారు.

రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని రవాణా శాఖ ఉప కమిషనర్ (డీటీసీ) ఆర్.సుశీల ఆదేశించారు. బుధవారం ఒంగోలు నగరం వెంగముక్కపాలెంరోడ్డులో గల రవాణాశాఖ కార్యాలయంలలో సిపోజియం ఆన్ రోడ్ సేఫ్టీ ఆడిట్ కార్యక్రమం జరిగింది. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అంతేకాకుండా ఇటీవల ప్రమాదాలు జరిగిన ప్రాంతాలపై విశ్లేషణ చేశారు. పెద్దారవీడు మండలం దేవరాజుగుట్ట సమీపంలో ఫ్లైఓవర్ వద్ద జరిగిన ప్రమాదం, దర్శి వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై చర్చించారు. మార్కాపురం బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోర్డింగ్‌లను తొలగించాలని నిర్ణయించారు. చినారికట్ల, పెదారకట్ల, రాయవరం, బేస్తవారపేట ప్రాంతాలలో రోడ్ల ఆక్రమణకు గురై పాదచారులు నడిచేందుకు వీలులేకుండా పోయిందని, అందువల్ల ఆక్రమణలు తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక ఒంగోలులోని పేస్, రైజ్ ఇంజనీరింగ్ కళాశాలల వద్ద సర్వీస్ రోడ్లు వేయటంతోపాటు రోడ్డు మార్కర్లు, స్పీడు బేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

- టి. రవికుమార్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7 : మెప్మాలో రుణ కుంభకోణం ఆరోపణలపై విచారణ జరుపుతున్నాం. వాస్తవమేనని తేలితే ఎంతటివారిపైన అయినా తగిన చర్యలు తీసుకుంటాం. పట్టణ పొదుపు మహిళల ఆర్థిక పురోభివృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ప్రోత్సహిస్తుంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు అవినీతికి పాల్పడినట్లుగా పత్రికలలో రావడం బాధాకరం. సీఎంఎం, సీఓలు, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు ఇలా ఏ స్థాయిలో అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదు. అక్రమాలు రుజువైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖపరంగా చర్యలు తీసుకుంటాము. ఇప్పటికే అన్నీ బ్యాంకులకు లేఖలు రాశాము. వివరాలు సేకరిస్తున్నాం. దీనిపై విచారణ వేగవంతం చేసి తగు చర్యలు తీసుకుంటాం. కార్యాలయ సిబ్బంది, ఆర్పీలు, బ్యాంకర్లతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేయడం తోపాటు, అవినీతిపై పారదర్శకంగా, పూర్తి స్థాయిలో విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటాం.

ఎట్టకేలకు డీఎస్సీ నోటిఫికేషన్

ఖాళీ పోస్టుల్లో కోత

740కి కేవలం 503 ప్రకటన

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 7 : నిరుద్యోగ ఉపాధ్యాయుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. అయితే పోస్టుల ప్రకటన విషయంలో మాత్రం నిరాశే ఎదురైంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక గత నాలుగున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులను ఉసురుమనిపించే డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించింది. మెగా డీఎస్సీ పేరుతో కనీసం 15 వేల పోస్టులకు తక్కువ కాకుండా ప్రకటిస్తారనుకుంటే కేవలం 6,100 పోస్టులకు మాత్రమే ఇచ్చారు. జిల్లాలో 730 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఇక్కడి డీఈఓ కార్యాలయం నుంచి పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయానికి నివేదించారు. అయితే డీఎస్సీలో కేవలం 503 పోస్టులు మాత్రమే ప్రకటించారు. జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులు 240 ఖాళీలు ఉండగా కేవలం 111మాత్రమే ప్రకటించారు. 130 పోస్టులు మిగిలిపోయాయి. అదేవిధంగా వివిధ సబ్జెక్టుల్లో 400 స్కూలు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా 299 మాత్రమే ప్రకటించారు. అంటే స్కూలు అసిస్టెంట్లలో 100 పోస్టులకు పైగా కోత పెట్టారు. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో 730 ఖాళీలు ఉంటే 300 పోస్టులకుపైగా వదిలేసి కేవలం 410కి మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. టీజీటీ 93 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు తాజా డీఎస్సీ నోటిఫికేషన్ పట్ల నిరుద్యోగులు పెదవి విరుస్తున్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఉప్పుటూరు గ్రామస్థులు

శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

● కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఉప్పుటూరు గ్రామ ముస్లింలు

పర్చూరు, ఫిబ్రవరి 7: వాడరేవు - పిడుగురాళ్ళ హైవే రహదారి నిర్మాణంలో శ్మశాన వాటిక స్థలాన్ని కోల్పోతున్నామని, తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతంలో తిరిగి స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ రంజిత్ బాషాకు మండలంలోని ఉప్పుటూరు గ్రామ ముస్లింలు వినతి పత్రం అందజేశారు. బుధవారం పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్పందన కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజీలు, రోడ్లు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిశీలించారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు ఇనాం భూములకు పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జగనన్న పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది. పురోగతి ఏమిటి ? అన్న విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను త్వరిత గతిన పరిష్కరించే విధంగా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ, తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య, సంధ్యశ్రీ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

వాలీబాల్ విన్నర్స్‌గా సెయింట్‌ఆన్స్ కళాశాల జట్టు

చీరాల,ఫిబ్రవరి 7 : విజ్ఞాన్ మహోత్సవ్ - 2024లో భాగంగా నిర్వహించిన అంతర్ ఇంజనీరింగ్ కళాశాలల క్రీడా పోటీలలో వాలీబాల్ విభాగంలో సెయింట్‌ఆన్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు క్రీడాకారులను అభినందించారు. కళాశాల పీఈటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో 8 యూనివర్శిటీల నుంచి 50 జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయన్నారు. విన్నర్స్‌గా నిలిచిన తమ జట్టుకు రూ.30వేలు నగదు బహుమతితో పాటు జట్టులోని క్రీడాకారులకు వ్యక్తిగత మెడల్స్ అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పారిశుధ్య నివారణపై జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

పారిశుధ్యం మెరుగుదలపై ప్రజలకు అవగాహన

బల్లికురవ. ఫిబ్రవరి7 : గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుదల అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి కోరారు. బుధవారం బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సెర్ప్ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో తడి పొడి చెత్త ఎక్కడ పడితే అక్కడ పడవేయటం వలన సీజనల్‌గా వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి రోజు పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలానే మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యర్థాలను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ఈశిక్షణలో ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ సుమతి, సెర్ప్ సంస్థ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, శిక్షకులు ప్రదీప్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

దేవాంగులకు సీట్లు కేటాయించాలి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 7 : రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు దేవాగుంలకు నిర్దీత సీట్లు కేటాయించాలని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దేశాయిపేటలో సంఘీయులతో కలసి మాట్లాడారు. చీరాల, రాజమండ్రి రూరల్, పుట్టపర్తి అసెంబ్లీ స్థానాలను, హిందూపురం ఎంపీ స్థానాన్ని తాము దేవాంగులకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్మా రాహుల్జి, యారాసు అరుణ్‌బాబు, దేవల మనుబ్రహ్మ, దేవాంగ సంఘ అధ్యక్షుడు వొలుకుల మోహనరావు, కార్యదర్శి చల్లా విజయ్, మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి త్యాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా కదలని శుద్ధిజల ప్లాంటు

పూర్తిగా నిలిచిపోయిన పథకం పనులు

పట్టించుకోని ప్రభుత్వం

అద్దంకి, ఫిబ్రవరి7: గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరకు శుద్ధి జలం అందించాలన్న ఉద్దేశంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శింగరకొండ వద్ద రూ. 1.50 కోట్ల వ్యయంతో శుద్ధిజల ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. అద్దంకి, బల్లికురవ మండలాలలోని 21 గ్రామాల ప్రజలకు తక్కువ ధరలో ఈ జలాన్ని ఇళ్ల వద్దకే సరఫరా చేసే విధంగా ప్లాంట్ రూపకల్పన చేశారు. 2018 ఫిబ్రవరి 16 వ తేదీని అప్పటి కలెక్టర్ వినయ్‌చంద్, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం భవనాసి చెరువులో ఇన్‌టేక్ వెల్ నిర్మాణం, అక్కడ నుంచి శింగరకొండ వద్ద ట్యాంక్ వరకు పైప్‌లైన్ నిర్మాణం జరిగాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడంతో పనులు





శింగరకొండ వద్ద భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టేక్‌వెల్ (ఇన్‌సెట్లో) నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంక్

పూర్తి గా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు శుద్ధిజలం సరఫరా ఎండమావిగానే మారాయి. ఆయా గ్రామాలలో ప్రయివేట్ వాటర్ ప్లాంట్‌ల ద్వారా ఎక్కువ ధరకు జలాన్ని ప్రజలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అర్ధాంతరంగా ఆగిపోయిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్పందనలో ఫిర్యాదుపై జేసీ విచారణ

మార్టూరు , ఫిబ్రవరి 7: కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. గత ఏడాది డిసెంబర్ 31 తేదీన మండలంలోని కోణంకి గ్రామంలో ఫాం 7పై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి భారీగా పోలీసులు వచ్చారు. ఓట్ల విచారణలో ఫాం 7కు సంబంధించి లబ్ధిదారులను విచారణ చేసేందుకు రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్న సమయంలో భారీగా పోలీసులు చేరుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఫాం -7లో పేర్లు ఉన్న సందెపోగు శోభారాణి, భార్య భర్తలు జొన్నలగడ్డ రామయ్య, రిబకా దంపతులు ఓట్ల విచారణలో పోలీసులు తమను భయభ్రాంతులకు గురి చేశారని, జనవరి నెలలో కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ శ్రీధర్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదుదారులను పిలిపించి విచారించారు. అదే విధంగా కోణంకి గ్రామానికి చెందిన ఉప్పలపాటి అశోక్ అనే యువకుడు తన ఓటు తొలగించారని కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ యువకుడిని కూడా జేసీ విచారించారు. ఈ గ్రామంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి భారీగా ఓటర్లను తొలగించాలనే ఉద్దేశంతో భారీగా ఫాం7లు దాఖలు చేశారు. అయితే వారు అందరు తాముకు ఓటు హక్కు ఉన్నట్లు సంబంధిత పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. అదే విధంగా స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుదారులు కూడా తమ పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. ఈ విషయమై జేసీ శ్రీధర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, స్పందనలో ఫిర్యాదుదారులు ఇచ్చిన అర్జీ మేరకు, కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశామని తెలిపారు.

విద్యార్థులు చిన్నతనం నుంచే ఆరోగ్యసూత్రాలు పాటించాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 7: విద్యార్థులు చిన్నతనం నుంచి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని మార్టూరు రోటరీక్లబ్ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు సూచించారు. మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ. 12 లక్షలతో మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హ్యాండ్‌వాష్, ఆర్వోప్లాంటు, టాయిలెట్స్ ఏర్పాటు చేశామని బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన గుర్తు చేశారు. విద్యార్థులు వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలు వివరించారు.ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు,రోటరీ సభ్యులు దొడ్డా మహేందర్, మాదాల సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడపర్తి పేరిరెడ్డి పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 7: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న బంద్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు కోరారు. ఇంకొల్లులో బుధవారం నార్నెసింగయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో రైతు ఉద్యమంతో కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు పార్లమెంటులో ప్రకటించి ఆచరణలో జాప్యం చేస్తున్నదని, ఇందుకు నిరసనగా ఈ నెల 16న జరిగే బంద్‌లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని రామకోటేశ్వరరావు కోరారు. బాచిన కోటేశ్వరరావు, అన్నెం ఆదెయ్య, బండి సాంబయ్య, చిలుకూరి శ్రీనివాసరావు,హరిబాబు, శంకరరావు, సుబ్బారావు, అంజియ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

బినామి పేర్లు తొలగించాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 7: అద్దంకి పట్టణంలో కార్పెంటర్లకు వుడ్ కాంప్లెక్స్ ప్లాట్లలో బినామీ పేర్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అద్దంకి పట్టణ కార్పెంటర్ నాయకుడు ఆళ్ళగడ్డ వీర సుందరాచారి కోరారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కష్టపడి పనిచేయాలి

అద్దంకి, ఫిబ్రవరి7: ఆర్టీసీ ఆదాయం పెంపునకు ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేయాలని ఆర్టీసీ (పీటీడీ) డైరెక్టర్ ఎ. రాజారెడ్డి అన్నారు. బుధవారం అద్దంకి డిపో లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ముందుగా గ్యారేజ్ ఆవరణలో రాజారెడ్డి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వటం, కార్గో



డిపోలో కార్మికులు, మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏపీఎస్ఆర్‌టీసీ(పీటీడీ) డైరెక్టర్ నాగిరెడ్డి

ఆదాయం పెంచటం ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం పెంచవచ్చన్నారు. సామాన్య ప్రయాణికుడు కూడా విలాసవంతమైన, సురక్షితమైన ప్రయాణం చేయాలనే ఉద్దేశంతో త్వరలో వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు, 1500 డీజిల్ బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆయన వెంట చీరాల డీఎం శ్యామల, అసిస్టెంట్ డీఎం మహబూబి, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

వైసీపీ విజయానికి కృషి చేయాలని చెప్పటంపై పెదవి విరుపు....

కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయి పరిష్కారానికి కృషి చేస్తారని కార్మికులు భావించారు. కార్మికులతో సమావేశం సందర్భంగా డైరెక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉండగా ఆర్టీసీకి నష్టం కలిగే విధంగా వ్యవహరించారని, ఎన్‌టీఆర్ కొంత మేర సహకారం అందించగా, వైఎస్ రాజశేఖరెడ్డి, జగన్మోహనరెడ్డిల వల్లనే ఆర్టీసీ మనుగడ సాధిస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికులు వచ్చే ఎన్నికలలో జగన్మోహనరెడ్డికి మద్దతు తెలపాలని పరోక్షంగా చెప్పటం పట్ల పలువురు కార్మికులు పెదవివిరిచారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టులు



పంగులూరుకు వెళ్లిన ఆశా కార్యకర్తలు, పోలీసులు

చినగంజాం, ఫిబ్రవరి 7 : ఆశా కార్యకర్తల డిమాండ్ల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద గురువారం జరిగే రాష్ట్ర వ్యాప్త ధర్నాకు అనుమతి లేదంటూ చినగంజాం పోలీసులు ఆశా కార్యకర్తలకు ముందస్తు నోటీసులు జారీతో పాటు అరెస్టులు చేశారు. చినగంజాం పీహెచ్‌సీ పరిధిలోని ఆశా కార్యకర్తలకు పోలీసులు బుధవారం నోటీసులు అందించి అదుపులోనికి తీసుకొని చినగంజాం పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌వో ఝాన్సీరాణి భర్త కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో చనిపోయారు. ఝాన్సీరాణి స్వగ్రామం అయిన జె.పంగులూరు గ్రామంలో ఝాన్సీరాణి భర్త ఆదరణ కూడిక కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీకి బుధవారం మధ్యాహ్నం వచ్చారు. వచ్చిన ఆశా కార్యకర్తలు బి.జయమ్మ, సీ.హెచ్.మర్తామ్మ, సీ.హెచ్.ఆదిలక్ష్మి, పీ.శ్రీలక్ష్మి, సీ.హెచ్. అజంతా, కే.రమాదేవి, బి.శారమ్మ, సౌజన్యలను పోలీసులు స్టేషన్‌కు పిలిచి వారికి నోటీసులు అందజేశారు. జె.పంగులూరు గ్రామంలో జరిగే కార్యక్రమానికి వెళ్తున్నామని ఆశా కార్యకర్తలు పోలీసులకు తెలిపారు. ఆశా కార్యకర్తలతో పాటు పోలీసులు కూడా జె.పంగులూరు వెళ్లారు. జె.పంగులూరులో కార్యక్రమం అయిన తర్వాత వారు సాయంత్రం 5.30 గంటల సమయంలో చినగంజాం వచ్చారు. అనంతరం ఆశా కార్యకర్తలను పోలీసుస్టేషన్లో నిర్బంధించారు

నేడు చలో విజయవాడ

చినగంజాం, ఫిబ్రవరి 7 : కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్, మెటర్నటీ సెలవులు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావుకి బుధవారం వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తలకు పనిభారాన్ని పెంచింది కానీ కనీస వేతనాలు పెంచలేదని పలువురు ఆశా కార్యకర్తలు తెలిపారు. పది వేల రూపాయిలు వేతనం ఇస్తున్నామనే పేరుతో 24 గంటలు చాకిరీ చేస్తున్నారని తెలిపారు. ఇతర సిబ్బంది చేయాల్సిన అనేక రకాల పనులు బెదిరించి, వేధించి మాతో చేస్తున్నారని వాపోయారు. పని భారాన్ని తగ్గించాలని, మొబైల్ వర్క్సపై శిక్షణ ఇవ్వాలని, పీహెచ్‌సీకి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టీఏ,డీఏలు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌లతో గురువారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరిగే ధర్నాలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రతాప్‌కుమార్ కోరారు.



వైద్యాధికారి విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశా కార్యకర్తలకు నోటీసులు

చీరాల,: విజయవాడలో గురువారం జరిగే ధర్నాకు నియోజక వర్గంలోని ఆశా కార్యకర్తలకు అనుమతి లేదని, అందులో పాల్గొన కూడదని తెలుపుతూ పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ కనీస స్వేచ్ఛ లేకుండా ప్రభుత్వం పోలీసులను ప్రయోగించటం దారుణమన్నారు.

వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శ

సంతమాగులూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసేవలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మక్కెన అంజయ్య ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం రవికుమార్ అంజయ్య ఇంటికి వెళ్ళి పరామర్శించారు.మిన్నెకల్లు గ్రామానికి చెందిన తన్నీరు కొండమ్మ బుధవారం మృతి చెందగా కొండమ్మకు నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా ఉందని అందుకు నిదర్శనమే ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్ పెట్టడం అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన చంద్రన్న బీమా పథకాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి చౌదరిబాబుపాల్గొన్నారు.



మక్కెనవారిపాలెంలో అంజయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పలు కుటుంబాలకు పరామర్శ

బల్లికురవ : ఇటీవల అనారోగ్యం బారిన పడిన పలువురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను బుధవారం అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. బల్లికురవ గ్రామానికి చెందిన మాజీ మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య భార్య అనురాధ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి మృతురాలికి నివాళులు అర్పించారు. అలానే కంభంపాటి అంజమ్మ కాలికి శస్త్ర చికిత్స చేయించుకోగా ఆమెను పరామర్శించారు. అలానే టీడీపీ ఎస్సీసెల్ నేత కత్తి బుల్లి అంజియ్య గుండె సంబంధ వ్యాధితో బాధ పడుతుండగా అయనను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో గొట్టిపాటి వెంట మండల పార్టీ అధ్యక్షులు కొండేటి ఇజ్రాయల్, నేతలు గొట్టిపాటి శంకర్, పావులూరి ఏడుకొండలు, దూళిపాళ్ల హనుమంతరావు, దద్దాల అంజయ్య పాల్గొన్నారు.



చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తలపనేని సుధాకర్

పీఏసీఎస్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

పంగులూరు, ఫిబ్రవరి 7: జనకవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ పంగులూరుకు చెందిన తలపనేని సుధాకర్ బాధ్యతలను స్వీకరించారు. బుధవారం రాత్రి పంగులూరు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన పాలకవర్గ చైర్‌పర్సన్‌గా నియమితులైన తలపనేని సుధాకర్‌కు సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొల్లా పోలయ్య, కట్టా నాగేశ్వరరావు, స్వయంపు హనుమంతరావు, రావూరి శ్రీనివాసరావు, నాగబోయిన తిరుపతయ్య, తలపనేని శ్రీనివాసరావు, బాచిన ఆంజనేయులు, గుడిపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

69 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకొన్న రేషన్ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మేదరమెట్ల , ఫిబ్రవరి 7: జాతీయ రహదారిలో తిమ్మన్నపాలెం వద్ద రేషన్‌బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం వేకువజామున మేదరమెట్ల వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న రేషన్‌బియ్యం లారీని ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ వాసుదేవరావు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లారీలో ఒక్కోటి 50 కేజీల బరువు ఉన్న 69 బస్తాలను పట్టుకుని కేసు నమోదు చేశారు. పట్టుకున్న బియ్యాన్ని రేషన్ డీలర్‌కు అప్పగించడంతో పాటు లారీని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు మేదరమెట్ల ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

వాడరేవు తీరంలో అనుమానాస్పద మృతదేహం



ఒడ్డుకు వచ్చిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 7 : చీరాల మండల పరిధిలోని వాడరేవు సముద్రతీరంలో బుధవారం సుమారు 60 ఏళ్ల వృద్ధుడి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణ, ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు బ్లూ రంగు చొక్కా, నలుపురంగు ప్యాంటు, షూ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

చినగంజాం తహసీల్దార్‌గా ఫణీంద్రబాబు



తహసీల్దార్ ఫణీంద్రబాబుని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

చినగంజాం, ఫిబ్రవరి 7 : మండల తహసీల్దార్‌గా జీవీఎస్.ఫణీంద్రబాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఆయన చినగంజాం వచ్చారు. చినగంజాం తహసీల్దార్‌గా పాలపర్తి పార్వతి విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఫణీంద్రబాబును డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ దాసరి శ్రీకాంత్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పర్చూరు తహసీల్దార్‌గా సుబ్బయ్య

పర్చూరు, ఫిబ్రవరి 7: పర్చూరు మండల తహసీల్దార్‌గా సీహెచ్.సుబ్బయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సంధ్యశ్రీ మార్టూరుకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 7: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డివిజన్ విద్యుత్ ఈఈ జాన్‌థామస్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 1,600 సర్వీలను తనిఖీలు చేసి అదనపు లోడ్ వాడుతున్న 132 సర్వీసులకు రూ.3.80 లక్షలు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ శ్రీనివాసరావు, చీరాల డీఈ టి.శ్రీనివాసరావు, వేటపాలెం డీఈ జె.శ్రీనివాసులు, పర్చూరు డీఈ రమేష్, 9 మండలాల ఏఈలు పాల్గొన్నారు.

చీరాలకు గర్వకారణం చిదంబరశాస్త్రి సేవలు

అన్నదానం చిదంబరశాస్త్రి సేవలు చీరాలకే గర్వకారణంగా నిలిచాయని పలువురు భక్తులు పేర్కొన్నారు. అయోధ్యలో చిదంబరశాస్త్రి బాలరాముడికి యంత్రం సమర్పించిన నేపథ్యంలో బుధవారం అయనకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు శ్రీరాముని భక్తులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేసే పార్టీలకు మద్దతు



బల్లికురవ ఎంఈవో కార్యాలయం వద్ద పోస్టర్‌ను అవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

బల్లికురవ. ఫిబ్రవరి 7 : ఉద్యోగులందరికి ఓల్డ్ పెన్షన్ అమలు జరిపే పార్టీలకు మద్దతు తెలియజేస్తామని ఉద్యోగులు తెలిపారు. బుధవారం బల్లికురవ ఎంఈవో కార్యాలయం వద్ద ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న ఉద్యోగులకు అమలు చేసే పెన్షన్ విధానాన్ని అమలు చేసే పార్టీలకు సార్వత్రిక ఎన్నికలలో తాము మద్దతు తెలియజేస్తామని వారు ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమేష్, యూటీఎఫ్ నేతలు అచ్యుత్ మోహన్, సంపతి శ్రీనివాసరావు, కొమ్మూరి ఏడుకొండలు, అనంతలక్ష్మి, నటరాజ, బొప్పుడి శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

10న అద్దంకికి మఠాధిపతులు రాక

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 7: ఈశ్వరిదేవి మఠం ఆ స్థాన మఠాధిపతులు వీరశివ కుమార స్వాములు ఈ నెల 10వ తేదీన అద్దంకిలోని కాకానిపాలెంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి రానున్నారని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కుమార స్వామి పర్యటనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, కలశ స్థాపన, అభిషేకం, 108 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, శాంతి హోమం వంటి పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పూజలలో పాల్గొనే వారు 9వ తేదీలోపు 9063239129 నెంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సహకారం




వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాపట్ల జిల్లా ఎంవీఐవో ప్రసన్నకుమారి, వైద్యాధికారులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాద బాధితులకు తగు సమయంలో సరైన వైద్యం అందించి వారికి సహాయ పడదామని బాపట్ల జిల్లా మోటార్ వెహికిల్ తనిఖీ అధికారిణి ఎస్. ప్రసన్న కుమారి అన్నారు. బుధవారం అద్దంకి వచ్చిన ఆమె 35వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బాపట్ల జిల్లా రవాణా శాఖ అధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో కలిసి గుడ్ సమారిటన్(మంచిసహాయకుడు)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంబంధిత పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌చంద్ర కుమార్, పురిటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకట కిరణ్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, రేడియోగ్రాఫర్ తాళ్ళూరి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

10 న అద్దంకి నియోజకవర్గ రేషన్ డీలర్ల సమావేశం

అద్దంకి, ఫిబ్రవరి7: అద్దంకి నియోజకవర్గ రేషన్ డీలర్ల సమావేశం ఈ నెల 10 వ తేదీ సాయంత్రం 3 గంటలకు అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డు చిన్ని శాంతయ్య భవనంలో జరుగుతుందని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పిన్నింటి గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు హాజరవుతారని తెలిపారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామన్నారు.



నేటి నుంచి న్యాయవాదులు విధుల బహిష్కరణ


నెల్లూరు (లీగల్) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ -2022కి రద్దు చేయాలని కోరుతూ గురువారం నుంచి 16వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరించనున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వర రెడ్డి, సుందరయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించి నట్లు వారు తెలిపారు. ఈ ఆందోళనకు న్యాయాధికారులు, న్యాయవాదులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

టచ్‌లో ఎవరున్నారు..

వారి కదలికలేంటి!?

- గ్రామస్థాయిలో టీడీపీ నాయకులపై నిఘా
- ఇంటెలిజెన్స్‌ను కాదని పోలీసులకు ఆదేశం
- సొంత పార్టీ అసంతృప్తి నేతలపైనా ఆరా
- రహస్య నివేదిక ఇవ్వాలని సూచనలు
- వలంటీర్లకూ అదనపు జీతాల ఎర

తెలుగుదేశం అభ్యర్థులు.. ఆశావహుల కదలికలపై వైసీపీ దృష్టి సారించింది. అందుకోసం ఎన్నడూ లేనివిధంగా ఇంటెలిజెన్స్ శాఖకు సమాంతరంగా పోలీసులను రంగంలోకి దించింది. టీడీపీ అభ్యర్థులు, ఆశావహులు, ముఖ్య నాయకుల వ్యక్తిగత పరిచయాలు, రహస్య భేటీలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాల్సిందిగా పోలీసు శాఖకు రహస్య ఆదేశాలు అందినట్లు తెలిసింది.



నెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో గెలవాలంటే ప్రత్యర్థి బలాలు, బలహీనతలు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. వైసీపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ఆ యుద్ధ నీతినే అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుల కదిలికలపై నిఘా ఉంచడంతో పాటు మండలాల పరిధిలో ముఖ్యమైన నాయకులు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారో ఎప్పటికప్పుడు తెలుసుకునే బాధ్యతను పోలీసు శాఖకు అప్పగించినట్లు తెలిసింది. తెలుగుదేశం అభ్యర్థికి మండల, గ్రామాల స్థాయిలో బలంగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులను గుర్తించి వారిని నయానో, భయానో లొంగదీసుకునేందుకు పోలీసు శాఖను వినియోగించుకొంటోందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులకు దగ్గరగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరో తెలిస్తే వారి బలహీనతలను అడ్డంపెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేయొచ్చన్నది వైసీపీ వ్యూహంగా చెబుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకుల ఆస్తులకు సంబంధించిన వివాదాలు, లేదా ఇతర కేసులను అడ్డం పెట్టుకొని వారిని లొంగదీసుకునే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

సొంతింటివారిపైనా నిఘా

అలాగే వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులనూ ఓ కంట కనిపెట్టనున్నారు. ఆ పార్టీ అధినాయకత్వం ఎమ్మెల్యేల పట్ల తీవ్రస్థాయిలో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు నాయకులు టీడీపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే కాంట్రాక్టు బిల్లులు, ఇతర వ్యక్తిగత వ్యవహారాల కారణంగా బయటపడటం లేదు కానీ చాలా మంది ప్రతిపక్ష పార్టీ నాయకులతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి విషయాలు పసిగట్టి తమ పార్టీ నాయకులపై కూడా నిఘా ఉంచే బాధ్యతను పోలీసు శాఖకు అప్పగించినట్లు తెలిసింది. ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశాలు వెలువడినట్లు సమాచారం.

వలంటీర్లకు రెండు విధులు

మరోవైపు వలంటీర్లను అదనపు జీతాల పేరుతో ప్రజలపైకి పంపుతోంది. ప్రభుత్వం తరపున ఇస్తున్న 5వేల జీతం కాకుండా వైసీపీ తరపున మరో రూ.5 వేల జీతం ఇస్తామని వలంటీర్లకు ఆశజూపుతోంది. ఎంఎల్‌ఓలు ప్రాంతాల వారీగా వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రకటిస్తున్నారు. ఇలా అదనపు జీతం ఇస్తున్నందుకు ప్రతీగా వలంటీర్లు రెండు పనులు చేయాల్సి ఉంటుంది. ఒకటి వారి పరిధిలోని కుటుంబాలను వైసీపీకి ఓటు వేసేలా మోటివేట్ చేయడం, రెండు ప్రతిపక్ష పార్టీలకు చెందిన సాను భూతిపరులను గుర్తించి ఆ కుటుంబాల పట్టువిడుపులను స్థానిక వైసీపీ నాయకులకు చేరవేయడం, వారి పరిధిలో ప్రతిపక్ష పార్టీ నాయకుల కదలికలను ఎప్పటికప్పుడు ఎంఎల్‌ఓలకు ఉప్పు అందిం చడం చేయాలని ఆదేశిస్తున్నారు. జగనన్న అధికారంలోకి వస్తే జీతాలు పెరగాయనే ఆశ కూడా చూపుతున్నారు. పోలీసుల ద్వారా నాయకులపై, వలంటీర్ల ద్వారా ప్రజలపై, ఐప్యాక్ టీం ద్వారా సొంత పార్టీలో అసంతృప్తులపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.



ఎంఎల్‌వోతో వాగ్వివాదం చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి మదన్‌రెడ్డి

ఎంఎల్‌వో వర్సెస్ టీడీపీ

- రామలింగాపురం సచివాలయం వద్ద ఉద్రిక్తత
- వలంటీర్లతో సచివాలయంలో సమావేశం
- టీడీపీ అడ్డుకోవడంతో వైసీపీ వ్యూహం రట్టు

నెల్లూరు(సిటీ),ఫిబ్రవరి 7 : రానున్న ఎన్నికల్లో వలంటీర్లను అడ్డంపెట్టుకుని తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్న అధికార వైసీపీ అందుకు ఎంఎల్‌వోలను రంగంలోకి దింపింది. పార్టీ ఆదేశాల మేరకు సచివాలయంలో వలంటీర్లతో నిర్వహించిన వైసీపీ ఎన్నికల సమావేశ గుట్టును టీడీపీ నాయకులు రట్టు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. అందిన సమాచారం మేరకు.. 19వ డివిజన్ రామలింగాపురం సచివాలయంలో ఎంఎల్‌వో (వైసీపీ నియమించిన థర్డ్ పార్టీ ఏజెన్సీకి చెందిన మండల లెవల్ ఆఫీసర్) బుధవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వలంటీర్ల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని స్విచ్ఛాఫ్ చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే రూ. 5 వేలతో పాటు వైసీపీ నుంచి రూ. 30 వేలు అదనంగా ఇస్తామని తెలిపారు. మీ పరిధిలోని 50 కుటుంబాలు వైసీపీకి ఓటేసే విధంగా కృషి చేయాలని సూచించారు. తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల జీతాలు మెరుగ్గా ఉంటాయని ఆశ చూపారు. ఈ సమయంలో కలగచేసుకున్న ఇద్దరు వలంటీర్లు ఈ పని మేము చేయలేమని చెప్పడంతో వారిని సమావేశం నుంచి బయటకు పంపేశారు. వారి ద్వారా సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త, డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి సచివాలయం వద్దకు చేరుకున్నారు. ఎంఎల్‌వోతో వాగ్వివాదానికి దిగారు. పార్టీకి చెందిన వ్యక్తులు సచివాలయంలో ఎలా సమావేశం నిర్వహిస్తారు...? అంటూ నిలదీయడంతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పరారయ్యారు. అనంతరం ఎంఎల్‌వోకు మదన్‌కు మధ్య గొడవ పెరిగింది. మీడియా అక్కడకు చేరుకోవడంతో ఎంఎల్‌వో కూడా జారుకున్నాడు. కాగా, ఈ విషమైన స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం. అధికారులను ఎంఎల్‌వో పై వివరణ కోరగా వారు ప్రభుత్వానికి సంబంధించిన వ్యక్తులు కాదని తెలిపారు.



వలంటీర్ల ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఎంఎల్‌వో

ఇంత దారుణం ఎన్నడూ చూడలేదయ్యా!

- మా హక్కులు, విధులు, నిధులు కాలరాశారు!
- వైసీపీ ప్రభుత్వంపై సర్పంచుల ఆగ్రహం

'టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో సర్పంచులుగా చేశాం. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న దారుణం మేమెప్పుడూ చూడలేదు. మా హక్కులను కాలరాయడమేగాక నిధులనూ దొడ్డిదారిన లాగేసుకున్నారు. ఓట్లు వేసిన ప్రజలకు సమాధానం చెప్పలేక సొంత డబ్బులతో పంచాయతీల్లో పనులు చేస్తున్నాం. బిల్లులు రాక అప్పులపాలయ్యాం' అంటూ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరుగుతున్న అన్యాయంపై పలువురు సర్పంచులు 'ఆంధ్రజ్యోతి'తో వెల్లబుచ్చుకున్నారు.

నిధులు, విధులకు కత్తెర



వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులతోపాటు విధులకు కత్తెరేశారు. ఏ చిన్న పని చేయాలన్నా పంచాయతీ ఖాతాల్లో పైసా లేదు. దీంతో డ్రైనేజీ, వీధిలైట్ల, పారిశుధ్య నిర్వహణ కూడా చేయలేకపోతున్నాం. వలంటీర్లకు ఉన్న విలువ సర్పంచులకు లేదు. కాంగ్రెస్, టీడీపీల ప్రభుత్వాల్లో సర్పంచుగా పనిచేశా. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న దారుణం మరే ప్రభుత్వంలోనూ లేదు.

- షేక్ నాజున్ని, సర్పంచు, తలుపూరుపాడు, సంగం మండలం

ఉత్సవ విగ్రహాలు అయ్యాం



పంచాయతీలకు ఎన్నికలు పెట్టి సర్పంచులను ఎన్నుకున్నారు. మాకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తీసేసుకుని మమ్మల్ని ఉత్సవ విగ్రహాలుగా చేసింది. పంచాయతీలో ఏ పని చేయాలన్నా నిధులు అవసరం. నిధుల కొరతతో ఏం చేయలేకపోతున్నాం.

- సునీల్‌కుమార్ నాయుడు, లక్ష్మీనరసింహపురం, మనుబోలు

స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం



వైసీపీ ప్రభుత్వ వైఖరితో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. ముఖ్యంగా పంచాయతీ వ్యవస్థ ఘోరంగా దెబ్బతిన్నది. మా మన్నేటికోట పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో తప్పితే వైసీపీ ప్రభుత్వంలో ఒక్క సిమెంటు రోడ్డు వేయలేకపోయాం. 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం చాకచక్యంగా లాగేసుకుంటూ పక్కదారి పట్టిస్తోంది. దీంతో చేసిన పనుల బిల్లుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నాతోటి సర్పంచులు, పనులు చేసిన కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యారు. జనరల్ ఫండ్స్ కూడా వాడుకునే వీలు లేకుండా డిజిటల్ సిస్టమ్ తెచ్చి గ్రామాల్లో వసూళ్లు చేసిన వివిధ రకాల పన్నులను రాష్ట్ర ప్రభుత్వం ఖాతాల్లోకి వేసుకొంది. ప్రజలు ఎంతో నమ్మకంతో సర్పంచుగా ఎన్నుకొన్నప్పటికి నిధుల కొరతతో గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులు చేయలేకపోయాననే బాధ వెంటాడుతోంది.

- పులివర్తి బసవయ్యనాయుడు, మన్నేటికోట, ఉలవపాడు మండలం

మా విలువలకు వలువలూడదీశారు



వైసీపీ ప్రభుత్వం మా విలువలకు వలువలూడదీసినా కేంద్రం కూడా పట్టించుకోలేదు. సర్పంచుగా ఎన్నికై మూడేళ్లు కావస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి శూన్యం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి కొంతమేర లక్షల్లో అప్పు చేసి పంచాయతీని నెట్టుకొస్తున్నాము. సర్పంచులకు విధులు, నిధులు రెండూ దూరం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. కేంద్రం విడుదల చేసిన 14, 15, ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేసి గ్రామాలను అభివృద్ధికి ఆమడదూరంలో నెట్టేసింది. ఆఖరికి పంచాయతీ సిబ్బంది జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి.

- కందికట్టు పెంచలయ్య, జొన్నవాడ, బుచ్చిరెడ్డిపాళెం మండలం

ప్రత్యేక కేటాయింపుల్లేవ్!

- సాదాసీదాగా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

నెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్‌అకౌంట్ బడ్జెట్‌లో ఏ ప్రాజెక్టుకూ ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. సాదాసీదాగా రాష్ట్ర బడ్జెట్‌ను రూ.2.86 లక్షల కోట్ల అంచనాలతో ప్రతిపాదించారు. అందులో ఫలానా శాఖకు, ఫలానా ప్రాజెక్టుకు అంటూ విడివిడిగా ప్రతిపాదనలు చూపలేదు. దీంతో కొత్త ప్రాజెక్టులకు కేటాయింపులు అటుంచితే ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టులకు కూడా బడ్జెట్ కేటాయింపులు లేనట్లేనని నిపుణులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదు. దీంతో ఎన్నికల తర్వాత ఏర్పడబోయే ప్రభుత్వమే పూర్తిస్థాయి బడ్జెట్‌ను రూపొందించనుంది. ఇప్పటికే బిల్లుల పెండింగ్‌తో చాలా ప్రాజెక్టులు పడకేశాయి. కొన్ని ప్రాజెక్టులకు అరకొరగా నిధులు కేటాయిస్తుండగా, మరికొన్ని ప్రాజెక్టులు గతంలో బడ్జెట్ కేటాయించినా చెల్లింపులు మాత్రం జరగలేదు. ఈ కారణంగా అభివృద్ధిలో కీలకమైన అనేక వర్కులు ఎక్కడికక్కడ ఆగిపోయి ఉన్నాయి. ఇప్పుడు కూడా ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, బిల్లులు వస్తాయో రావోనన్న ఆందోళనలో ఉన్న కాంట్రాక్టర్లు రేపు ప్రభుత్వం మారితే మరిన్ని ఇబ్బందులు ఎదరవుతాయన్న ఉద్దేశంతో మిగిలిన పనులను కూడా నిలిపేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రాధాన్యత ప్రాజెక్టులకు కూడా మోక్షం లభించేలా కనిపించడం లేదు.

అంచనాలు కొండంత.. ఖర్చులు పిసిరంత



13 వేల కోట్ల రెవెన్యూ లోటును 44వేల కోట్లకు, 35వేల కోట్ల ద్రవ్యలోటును 60వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదే. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు ఏమీ లేవు. వైసీపీ హయాంలో రెట్టింపు అయిన ఏపీ అప్పులు. 2014-19 మధ్యలో టీడీపీ తీసుకున్న దానికంటే నాలుగురెట్లు ఎక్కువ. అప్పులప్రదేశ్‌గా ఏపీని మార్చిన ఘనత జగన్ అండ్ కోదే.

- అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు

ఇదో గారడీ బడ్జెట్



రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు మరో రెండు నెలల్లో జరుగుతుండటంతో వైసీపీ ప్రభుత్వం గారడీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయలేని ఈ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టేలా బడ్జెట్ ప్రవేశపెట్టింది. జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

- చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు

అన్నీ అవాస్తవాలే



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నీ అవస్తవాలే వెల్లడించారు. ప్రకటించిన వన్నీ కాకి లెక్కలే తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయటం లేదు. ఏ రాష్ట్రంలో చేయలేని వైఎస్సార్ ఉచిత బీమా అమలు చేస్తుంది ఆంధ్రప్రదేశ్ ఒక్కటే నని చెబుతున్న మంత్రి కేవలం కొద్ది మందికే అమలు చేసి అందరికి అమలు చేశామని చెబుతుండటం దారుణం. అలా అయితే రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటారో మంత్రి బుగ్గనే చెప్పాలి.

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

అన్నీ జిమ్మిక్కులే



బడ్జెట్‌లో మంత్రి బుగ్గన అన్నీ జిమ్మిక్కులే ప్రదర్శించారు. ఆయన చెప్పినట్లు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో ఎక్కడ అమలు చేశారో చెప్పాలి. 4.95 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారు. కానీ అవి అమలు కాలేదు. ప్రతి ఏడాది జాబ్ చార్ట్ రిలీజ్ చేస్తామని వైసీపీ ప్రభుత్వం మొదట్లో చెప్పింది. అమలు కాలేదు. మంత్రి బుగ్గన మాత్రం అంతా చేశామని చెబుతున్నారు.

- మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

అన్ని వర్గాలకు సముచితస్థానం ఎక్కడ?

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇచ్చామని ప్రభుత్వం చెబుతోంది. అవన్నీ ప్రకటనలే. నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమం గురించి బుగ్గన గొప్పగా వివరించారు. ఇయితే క్షేత్రస్థాయిలో అమలుకు మాత్రం నోచుకోలేదు. అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపామని చెబుతున్నా అది కేవలం లెక్కల్లో మాత్రమే ఉంటోంది.

- దామా అంకయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- జిల్లాలో 346 పోస్టులు
- 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 7 : ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టులు ప్రకటించగా వాటిలో జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈనెల 12 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. 12 నుంచి 21వతేదీ వరకు ఫీజు చెల్లించి cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 22వతేదీ లోపల దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 24న ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహించి మార్చి 5వతేదీ నుంచి హాల్‌టికెట్లు పంపిణీ చేస్తామ న్నారు. మార్చి 15 నుంచి 30వతేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో డీఎస్సీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కాగా, గురువారం నుంచి టెట్ నిర్వ హణ చేపట్టి ఏప్రిల్ 7వతేదీన ఫలి తాలు వెల్లడిస్తామన్నారు. టెట్‌కు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ ఈనెల 17 అని, దరఖాస్తుకు చివరి తేదీ ఈనెల 18గా నిర్ణయించార న్నారు. ఈ నెల 23 నుంచి హాల్‌టికెట్లను అందచేస్తామన్నారు. ఈ పరీక్షను ఈనెల 27 నుంచి మార్చి 9వతేదీ వరకు ఉదయం, మధ్యా హ్నం రెండు సెషన్‌లలో నిర్వహించి మార్చి 14న ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

జిల్లాలో 346 పోస్టులు....

డీఎస్సీకి సంబంధించి జిల్లాకు 346 పోస్టులు కేటాయించారు. దీనిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) 104, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) 140, టీజీటీ 102 పోస్టులు ఉన్నాయి.

వచ్చే ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం తప్పదు : యూటీఎఫ్



వరికుంటపాడు: గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 7: ఉద్యోగుల పట్ల నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని యూటీఎఫ్ జిల్లా శాఖ ప్రతినిధి ఆర్ నాగార్జున అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీలకే తాము ఓట్లు వేయడం జరుగుతుందన్నారు. అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ ఇంతవరకు హామీని నెరవేర్చకపోగా నూతనంగా జీపీఎస్ విధానాన్ని తీసుకురావడం దారుణమని మండిపడ్డారు. అలాగే డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించకపోగా ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్ నగదును సైతం వాడుకొని తిరిగి జమచేయకపోవడం ఎంతవరకు సమంజసమని దుయ్యబట్టారు. ఉద్యోగులు ఐక్యంగా జగన్‌కు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ నారాయణ, వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కలువాయి: యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం కలువాయిలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టరును ఆవిష్కరించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోస్టరు అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎస్ అనే నినాదంతో పాత పెన్షన్ పునరుద్ధరణ రాజకీయ అజెండా కావాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విస్మరించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఓపీఎస్ సాధనే లక్ష్యంగా అన్ని రాజకీయ పక్షాల నాయకులను కలుసుకుని పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవిబాబు, చల్లా మల్లికార్జునరెడ్డి, బొలిగర్ల మస్తాన్‌బాబు, కె సుధాకర్, వీ కృష్ణయ్య, జీ రాధాకృష్ణ, యూ లక్ష్మీనారాయణ, కె పెంచలయ్య, వజ్రల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా నందీశ్వరుడికి అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న వేదపండితులు

సంగం, ఫిబ్రవరి 7: స్థానిక సంగమేశ్వరాలయంలో ఉన్న నందీశ్వరునికి బుధవారం అభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల ఆధ్వర్యంలో తొమ్మిది రకాల పండ్ల రసాలు, క్షీర, పంచామృత, నవ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరున్ని పూలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు నందీశ్వరుని దర్శించుకున్నారు.

రమాబాయి అంబేడ్కర్ జయంతి



రమాబాయి అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్

సంగం, ఫిబ్రవరి 7: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట ప్రాథమిక ప్రాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పరిశీలన



సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు రామాదేవి

సంగం, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని సంగం బిట్-1 సచివాలయంలో జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దారు రమాదేవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వర్ సమస్య ఏర్పడడంతో రిజిస్ట్రేషన్‌లు జరగడంలేదని సచివాలయ సిబ్బంది ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 7: నెల్లూరులో గురు, శుక్రవారాల్లో జరిగే ట్రెజరీ ఉద్యోగుల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఉదయగిరి తాలుకా ఎన్‌జీవో అధ్యక్షుడు బొమ్మతట్టు శ్రీహరి బుధవారం కోరారు. ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

పల్లెల్లో గుప్పుమంటున్న గంజాయి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 7 : మండలంలోని చుండి, అంకభూపాలపురం, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, గరుకుపాలెం, పోలినేనిచెరువు, కాకర్లవారిపాలెం తదితర గ్రామాల్లో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు కలిగిరి నుంచి గంజాయి తీసుకొచ్చి కొండాపురం, లింగసముద్రం వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లోని నిర్వాహకులకు అందజేస్తునట్లు సమాచారం. గంజాయి నిర్వాహకులు కళాశాలలు, హైస్కూల్ విద్యార్థులు, యువతనే ప్రధాన లక్ష్యంగా చేసుకొని అమ్మకాలు చేపడుతున్నట్లు తెలిసింది. గంజాయి పొడిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి రూ.50, రూ.100లకు విక్రయిస్తున్నారు. యువకులు గంజాయి తాగి వికృతి చేష్టలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పైపులైను పగిలి తాగునీరు వృథా



పైపులైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

లింగసముద్రం, ఫిబ్రవరి 7 : మండలంలోని పెంట్రాల సచివాలయం ఎదురుగా ఉన్న తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది.గ్రామంలోని ప్రజలకు మంచినీటిని అందించే తాగునీటి పైపులైన్ పగిలింది.అంతేకాక ఇక్కడ స్థానికంగా ఉన్న ఒకరు ఈ పైపులైన్ నుంచి నీటిని పట్టుకొనేందుకు పైపును ఏర్పాటు చేశారు.అది కూడా ఊడి వచ్చింది. ఈ రెండు కారణాలతో ఈ పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 7: అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని మోటారు వాహనాల తనిఖీ అధికారి రాములు, ఆర్టీసీ డీఎం కరీ మున్నీసా తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రధాన రహదారి వెంబడి విద్యా ర్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వాహన చోదకుల నిర్లక్ష్యం వలన అమాయకులు బలవుతున్నారని, ముఖ్యంగా యువత అతివేగంగా వాహనాలు నడుపుతూ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 7: ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలికి వంద రోజుల పని దినాలు కల్పించాలని ఏపీడీ గాయత్రీదేవి సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1450 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకం లక్ష్యమన్నారు. అర్హులైన సన్న, చిన్నకారు రైతులు తమ దరఖాస్తులను ఆయా ఉపాధి కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ప్రభుత్వం మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు సైతం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న నారాయణరావు

మర్రిపాడు, ఫిబ్రవరి 7: పరీక్షల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో విద్యార్థులు వత్తిడికి గురికాకుండా చదువుపై శ్రద్ధపెట్టి ప్రశాంతంగా ఉండాలని ఆత్మకూరు తెలుగు భారతి సేవా సంస్థ అధ్యక్షుడు మోటివేటర్ వీ నారాయణరావు సూచించారు. మర్రిపాడు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బట్టీపట్టి చదవకుండా పాయింట్స్ వారీగా నేర్చుకోవాలని, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఎక్కువ సమయం రాత్రివేళల్లో మేల్కోవద్దని, సెల్‌ఫోన్ వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డీ నారాయణరావు, హెచ్‌ఎం పద్మలత పాల్గొన్నారు.

రేపు జాతీయ నులిపురుగుల నివారణ దినం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 7: జాతీయ నులిపురుగుల దినం సందర్భంగా మండలంలో 9,896 మంది విద్యార్థులకు మాత్రలు మింగించడమే లక్ష్యమని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, మండల వైద్యాధికారి వినీత పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అనంతరం అల్‌బెండజోల్ 400 ఎంజీ మాత్రలను మింగించాలన్నారు. ఇప్పటికే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పచ్చవ లావణ్య, ఆరోగ్య విద్యాధికారి కె.వెంకటసుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజరు సోను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై బీఎల్‌వోలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి, ఫిబ్రవరి 7: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఈవీఎంలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితాలను మరోసారి పరిశీలించుకోవాలన్నారు. ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాల న్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలి

సీతారామపురం, ఫిబ్రవరి 7 : ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్ అబ్దుల్‌కలాం ఆజాద్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వేల్ఫేర్ సహాయకులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ళపట్టాలు రిజిస్ట్రేషన్ త్వరితగతిన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, వేల్ఫేర్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు తహసీల్దారుగా సీతారత్నం

మర్రిపాడు, ఫిబ్రవరి 7: మర్రిపాడు తహసీల్దారుగా బుధవారం సీతారత్నం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా బాపట్ల కలెక్టర్ కార్యాలయం నుండి మర్రిపాడుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దారు ఆనంద్‌రావు బుచ్చిరెడ్డిపాలెంకు బదిలీ అయ్యారు.

వరికుంటపాడు తహసీల్దారుగా చంద్రారెడ్డి

వరికుంటపాడు, ఫిబ్రవరి 7: వరికుంటపాడు మండల తహసీల్దారుగా ఏవీపీ చంద్రారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి ఆహ్వానం పలికారు.

పంచాయతీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 7: ఉదయగిరి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా షేక్ కరీముల్లా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరసయ్య వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీకి బదిలీ కావడంతో శకునాలపల్లి పంచాయతీ కార్యదర్శి కరీముల్లాకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

జై భారత్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొవ్వారపు

సీతారామపురం, ఫిబ్రవరి 7: జైభారత్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొవ్వారపు వెంకటేష్‌ను నియమించినట్లు ఉదయగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ముప్పాళ్ళ శ్రీరామరాజు తెలిపారు. బుధవారం మండలంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామని, ఐదు రూపాయల సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యులుగా చేరాలని కోరారు. జైభారత్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ రామరాజు, కొండమూరి శ్రీనివాస్. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నిరుద్యోగులను మోసగించిన జగన్ : ఇంటూరి



కందుకూరు : కరపత్రం అందచేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు, తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 7: నాలుగున్నరేళ్ల జాబ్ క్యాలెండర్‌ను పట్టించుకోని సీఎం జగన్, ఇప్పుడు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నాడని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని 4వ వార్డు సాయిబాబా గుడిప్రాంతంలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మినీ మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, మచ్చా మనోహర్, పువ్వాడి రమేష్, పువ్వాడి నరసింగరావు, నందనవనం రాము, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● కావ్య క్రిష్ణారెడ్డిని సత్కరించిన నేతలు

కావలి : టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి ఇంటికి బుధవారం పట్టణంలోని పలువార్డుల నుంచి, తీరప్రాంత మత్స్యకార గ్రామాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు వచ్చి మద్దతు తెలిపారు. అలాగే మహా జనసైన్యం యూత్ 150 మంది వరకు వచ్చి కావ్యకు మద్దతు పలుకుతూ టీడీపీ విజయం కోసం కృషిచేస్తామని చెప్పారు. స్థానిక 34వ వార్డుకు చెందిన టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వార్డు ప్రజలు కావ్యను కలిసి గజమాలతో సత్కరించారు. 11 వవార్డుకు చెందిన టీడీపీ నాయకుడు షైనంపాటి జగదీష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ మోడల్‌కాలనీకి చెందిన వారు కూడా వచ్చి మద్దతు తెలిపారు. అలాగే 18వ వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు వచ్చి మద్దతు తెలిపారు. కాగా మహా జనసైన్యంకు చెందిన యువత ర్యాలీగా క్రిష్ణారెడ్డి ఇంటికి వచ్చి ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహా జనసైన్యం నేతలు కత్తి లక్ష్మణ్, నందల నరేష్‌యాదవ్, రాంబాబు యాదవ్, శివయాదవ్, పెంచల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● అధిష్ఠానం నిర్ణయం మేరకు పనిచేస్తాం..

దగదర్తి(బిట్రగుంట) : టీడీపీ అధిష్ఠానం నిర్ణయం మేరకు తాము పనిచేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మాలేపాటి రవీంద్రనాయుడు, టీడీపీ కావలి మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తిలోని వారి స్వగృహంలో బుధవారం వివిధ పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబుతో త్వరలో భేటీ కా నున్నా టటమని, పార్టీ నేతలు, కార్యకర్తల నిర్ణయం మేరకు ఇతర పార్టీల వారిని టీడీపీలో చేర్చుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మాలేపాటి సుధాకర్‌నాయుడు, భానుచందర్, శ్రీహరినాయుడు, కంచర్ల.కృష్ణ వోగోపాల్, పులి శీనయ్య, ఇబ్రహీం, ఆసీఫ్, మాధవరావు పాల్గొన్నారు.



కావలి : కావ్య, మలిశెట్టిలను గజమాలతో సత్కరిస్తున్న 34వ వార్డు ప్రజలు



బిట్రగుంట : కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

రోడ్డు ఆక్రమించి రేకుల పంచ



రైల్వేస్టేషన్ సెంటర్‌లో రోడ్డుపైకి వచ్చిన రేకుల పంచ

కావలి,ఫిబ్రవరి7: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా అడిగే నాథుడే కరువయ్యాడు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో కొత్తగా నిర్మించిన ఓ దుకాణ సముదాయం ముందు మెట్లను రోడ్డుపై నిర్మించారు. అంతకు మునుపు అక్కడ ఉన్న విద్యుత్ స్థంభాన్ని తొలగించి దాన్ని రోడ్డుపైకి వేసేటట్లుగా చేశారు. కాగా ఆ మెట్లను లోపలకు సర్దుబాటు చేయకపోగా అక్కడ వరకు పర్మినెంట్‌గా రేకులతో పంచ వేశారు. దీంతో అక్కడ రోడ్డు కుంచించుకుపోయినా అధికారులు పట్టించుకోవటం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు, ఫిబ్రవరి 7 : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనరు ఫణికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎవరికి అనారోగ్య సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రి సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

కందుకూరు, ఫిబ్రవరి 7: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రైతు సాధికారసంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు డీ మాలకొండయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారం తీసుకోవటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న పండ్లమొక్కలను, వనమూలికల గార్డెన్‌లను సందర్శించి, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, బోటనీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి తిరుపతిస్వామి, ఎం. బాలునాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సునీత, ధనమ్మ, వంశీ, మాధవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఉలవపాడు : తహసీల్దార్‌గా బుధవారం కే రవిబాబు బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా తెనాలి నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ బ్రహ్మయ్య బాపట్ల జిల్లా చెరుకుపల్లికి బదిలీపై వెళ్లారు. డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, సర్వేయర్ శ్రీనివాసులు కొత్త తహసీల్దార్‌కు బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

వలేటివారిపాలెం : విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవి ఉత్తీర్ణత సాధించాలని కందుకూరు డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని జమీన్ ఉప్పలపాడు కేజీబీవీలో బుధవారం ప్రిన్సిపాల్ గోవర్ధిని అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవికుమార్, మల్లికార్జునరావు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశన్, సర్పంచి వింజం వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు కమల్‌కుమార్, మాధవరావు పాల్గొన్నారు.

పేదలకు సేవ.. దైవసేవతో సమానం

బిట్రగుంట : అనాథలకు, పేదలకు సేవచేయడం భగవంతుడిని సేవించడంతో సమానమని స్థానిక సంఘ కాపరి పాస్టర్ రెవరెండ్ డీ.దేవానంద్, బ్రదర్ జీ.షాలుమ్‌రాజ్ అన్నారు. బోగోలు మండల విశ్వనాథరావుపేటలో ప్లాటినం తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. అనంతరం పేదలకు భోజనం, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు ఏ.మనోహర్, కార్యదర్శి ఎస్‌ఏ ధనరాజ్, ట్రెజరర్ చంద్రహాస్, పాస్టర్లు సీహెచ్.నాగరాజు, శ్యాం సన్‌బాబు, రవికుమార్, స్టీవెన్‌కుమార్ పాల్గొన్నారు.

సురేష్‌బాబు నియామకం హర్షణీయం

బిట్రగుంట : పీసీసీ అధికార ప్రతినిధిగా రెండోసారి కూడా లేల్లపల్లి సురేష్‌బాబును నియమించడం సంతోషకరమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు తులసీరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి రెండోసారి సురేష్ పేరును ప్రతిపాదించడం సంతోషకరమన్నారు.

వడ్డె కుటుంబానికి పలువురి పరామర్శ



వడ్డె శ్రీరాములు నాయుడుకు నివాళులు అర్పిస్తున్న మాలేపాటి రవీంద్రనాయుడు

దగదర్తి (బిట్రగుంట), ఫిబ్రవరి 7: దగదర్తి మండల సీనియర్ టీడీపీ నాయకుడు వడ్డె శ్రీరాములు నాయుడు(90) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ఉత్తరక్రియలు బుధవారం జరగ్గా, పలువురు నేతలు హాజరై నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు మాలేపాటి రవీంద్రనాయుడు, మాలేపాటి సుబ్బానాయుడు, భానుచంద్ తదితరులు శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక నేతలు తాళ్లూరు సుధాకర్ నాయుడు, మాజీ సర్పంచు జలదంకి శ్రీహరి, కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్యకృష్ణారెడ్డి, బోగోలు నేతలు నాగేశ్వరావు, కాంద్ర రఘురామ్ తదితరులు వడ్డె కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీకాంత్ నాయుడులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చేనేతల భూములకు పట్టాలివ్వండి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మికులు

కలిగిరి, ఫిబ్రవరి 7: ముప్పైఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకపోవడం చేనేతలను చిన్నచూపు చూడటమేనని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పూజల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం తహసీల్దారు బాలకిషోర్‌కు చేనేత కార్మికులతో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. కలిగిరి మండలం కొత్తపేట రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 1లో 48 ఎకరాల భూమిని ఒక్కొక్క కుటుంబానికి 1.10 ఎకరాల వంతున మొత్తం 44 కుటుంబాలకు 1993లో సీలింగ్ ల్యాండ్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ భూములకు ఇప్పటివరకు పట్టాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వెంటనే జిల్లా కలెక్టరు చొరవ తీసుకుని ఆ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను నిర్వీర్యం చేస్తున్న పోలీసులు



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత నేతలు

కావలి, ఫిబ్రవరి7: కావలి డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎమ్మెల్యే జోక్యంతో పోలీసులు ఆ కేసులను నిర్వీర్యం చేస్తున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేసి, ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అట్రాసిటీ కేసులో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని పోలీసులపై ఒత్తిడి తెచ్చి అసలు కేసు కట్టకుండానే చేస్తున్నారని ఆరోపించారు. డివిజన్‌లో దళిత, గిరిజనులు ఫిర్యాదు చేస్తే కేసులు కట్టనీయకుండా స్థానిక ఎమ్మెల్యే అడ్డుపడుతుండటం ఎంతవరకు న్యాయమన్నారు. ఆర్డీవో స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నేతలు కోవూరు బాబు, చౌటూరి వెంకటరత్నం, జరుగుమల్లి విజయరత్నం, గాలి రాజ, డాక్టర్ వేణుగోపాల్, కాకిమల్లి, మస్తానయ్య, ముక్కు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓబులమ్మకు పొంగళ్లు

అల్లూరు, ఫిబ్రవరి 7 : స్థానిక రజకకాలనీలోని ఓబులమ్మకు బుధవారం భక్తులు పొంగళ్లు నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న తిరునాళ్లలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారిని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవర్లకు గ్రామోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. నాయుడు మల్లికార్జున జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

కావలిటౌన్ : జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైసీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏరాష్ట్రంలో కూడా అమలు కావడంలేదన్నారు. ప్రతిపక్షాలు ఏం అభివృద్ధి చేసాయో చెప్పాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ప్రసాద్, అమరా వేదగిరి, తిరివీధి ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడు నెలలుగా నీరు లేకపోతే పట్టించుకోరా ?

బిట్రగుంట, ఫిబ్రవరి 7: 24 గంటల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మూడు నెలలుగా నీరులేక పోయినా పట్టించుకోవడం లేదంటే సిగ్గుచేటని కోవూరుపల్లి వాసులు పేర్కొన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీకి బుధవారం ఉదయం 8.10 గంటలకు బీపీ, షుగర్ చెక్ చేయించుకునేందుకు స్థానికుడు మురళీరెడ్డి గ్రామస్థులతో కలిసి వెళ్లాడు. ఆ సమయంలో ఆరోగ్య సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆవేదన చెందాడు. నెమ్మదిగా చేరుకున్న సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న వైద్యులు గ్రామస్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రాత్రి డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సు ఇందిర మాట్లాడుతూ ఆ సుపత్రిలో వాష్ రూముకు వెళ్లాలన్నా నీళ్లు లేవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టి తీసుకుపోతామని స్థానికులు మురళీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జైభీమ్ అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడ రవిచంద్ర తదితరులు పేర్కొన్నారు.

రేపు ఆరోగ్య సురక్ష

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 7 : మండలంలోని కళవళ్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు రెండవ విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.